**విలేకరులు కావలెను**

**తొలివెలుగు** జాతీయపత్రికలో పనిచేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతుంది.

సంప్రదించాల్సిన చిరునామా..

**సెల్ : 9491134365**



# తొలి వెలుగు

TGTEL/26/A6221

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం — జాతీయ పత్రిక

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 01 | సంచిక. 80 | శుక్రవారం | 16-అక్టోబర్-2026 | ఎడిటర్: యంజాల ప్రవీణ్ | పేజీలు: 8 | వెల రూ. 2/ |
|---|---|---|---|---|---|---|---|
| Yadadri Bhuvangiri | Volume: 01 | Issue. 80 | Friday | 16.10.2026 | Editor: Yamjala Praveen | pages: 8 | cost. 2/ |


జంతర్‌మంతర్ తొలగింపుపై

## సుప్రీంకోర్టు నోటీసులు

- కేంద్రం, ఢిల్లీ పోలీసుల వివరణ కోరిన ధర్మాసనం
- సమాధానాలు సంతృప్తికరంగా లేకపోతే చట్టం తన పని తాను చేసుకుపోతుంది
- ప్రత్యామ్నాయ నిరసన వేదికలపై అభ్యంతరాలు

2



రాహుల్ గాంధీపై

# సుప్రీం ఆగ్రహం

- న్యాయవ్యవస్థను బెదిరించలేరు.. వివరణ ఇవ్వాల్సిందే
- కోర్టు వరకు రాజకీయ పాదయాత్రలు ఆమోదయోగ్యం కాదు
- రాహుల్, అఖిలేశ్ యాదవ్‌లకు నోటీసులు

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. న్యాయస్థానం వరకు రాజకీయ పాదయాత్ర చేపట్టి నిరసన తెలపడాన్ని తప్పుబట్టింది. ఇలాంటి చర్యల ద్వారా న్యాయవ్యవస్థపై ఒత్తిడి తీసుకురాలేరని స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై రాహుల్ గాంధీ వివరణ ఇవ్వాల్సిందేనని ఆదేశించింది. అక్టోబర్ 12న ఇండియా కూటమి నేతలతో కలిసి ఆయన సుప్రీంకోర్టు వరకు పాదయాత్ర చేపట్టి నిరసన తెలిపిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది.

కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి నేతలు సోమవారం 'మార్చ్ ఫర్ డెమోక్రసీ' పేరుతో సుప్రీంకోర్టు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేలాది తరువాయి 2లో




# యాసంగిలో వరి వేయొద్దు

## ఎల్‌నినోతో నీరు, విద్యుత్ కొరత తప్పదు

- రాబోయే 8–10 నెలలు నీటిని పొదుపుగా వాడుకోవాలి
- సాగు విరమించే రైతులకు కేంద్రం నష్టపరిహారం ఇవ్వాలి
- రాష్ట్రానికి అదనపు విద్యుత్ కేటాయించాలి.. సబ్సిడీలు పెంచాలి
- కేంద్రం ప్రభుత్వం అదనపు సాయం అందించాలి
- మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**సాగు చేయని రైతులకు ఆ నష్టాన్ని కేంద్రం పూడ్చాలి. తాగునీరు, విద్యుత్ సమస్య అధిగమించేందుకు అందరూ సహకరించాలి. నీరు లేక పశువులు, మూగజీవాలకు నష్టపోయే పరిస్థితి రావొద్దు. రాష్ట్రానికి కేంద్రం తోడ్పాటు ఇస్తేనే ఈ విపత్తును అధిగమించగలం. సమస్యను పరిష్కరించేందుకు కేబినెట్ సబ్‌కమిటీ వేస్తున్నాం. సమస్యలు, సమాచారం ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు టోల్‌ఫ్రీ నంబర్ ఇస్తున్నాం. నోడల్ అధికారిగా రామకృష్ణారావును నియమిస్తున్నాం. దసరా తర్వాత భట్టి విక్రమార్క నేతృత్వంలో అఖిలపక్ష భేటీ నిర్వహిస్తాం.** — సీఎం, రేవంత్ రెడ్డి

**హైదరాబాద్:** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో రానున్న రోజుల్లో తాగునీరు, సాగునీరు, విద్యుత్ కొరత తీవ్రరూపం దాల్చే అవకాశం ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. శాస్త్రవేత్తలు అంచనా వేసినట్లుగానే పరిస్థితులు చేయిదాటే ప్రమాదం ఉందని హెచ్చరించారు. నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని రైతులు యాసంగిలో వరి సాగు చేయవద్దని విజ్ఞప్తి చేశారు. వీలైనంత వరకు పంటల సాగును తగ్గించుకోవాలని, ఆరుతడి పంటలకే ప్రాధాన్యమివ్వాలని సూచించారు. రాబోయే 8–10 నెలలు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మంత్రులు, ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో సీఎం మాట్లాడారు.

గత ఏడాది ఇదే సమయానికి రాష్ట్రంలోని రిజర్వాయర్లలో 400 టీఎంసీలకు పైగా నీరు అందుబాటులో ఉండగా.. ప్రస్తుతం అన్ని జలాశయాల్లో కలిపి 209 టీఎంసీలు మాత్రమే ఉన్నాయని రేవంత్‌రెడ్డి తెలిపారు. నీటి కొరతను దృష్టిలో పెట్టుకుని అందుబాటులో ఉన్న జలాలను తాగునీటి అవసరాలకే ప్రాధాన్యమిస్తూ వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎప్పుడు కరవు వచ్చినా దేశాన్ని ఆదుకున్నది రైతులేనని గుర్తుచేశారు. ఇప్పుడు ప్రకృతి విపత్తును అధిగమించేందుకు రైతులు సహకరించాలని కోరారు. సాగు చేయకుండా నష్టపోయే రైతులకు కేంద్ర ప్రభుత్వం పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

కేంద్రం అదనపు సాయం అందించాలి

ఎల్‌నినో కష్టకాలంలో రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలవాలని సీఎం కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త పథకాల్లో కేంద్రం వాటాను పెంచాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి అదనపు విద్యుత్ కేటాయించడంతో పాటు విద్యుత్ సబ్సిడీలను పెంచాలని కోరారు. కేంద్రం నుంచి అధిక నిధులు సాధించేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. కొవిడ్ సమయంలో ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపునకు అనుగుణంగా వ్యవహరించామని, కష్టకాలంలో రాజకీయాలకు తావివ్వకుండా సహకరించామని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఇప్పుడు కూడా విపక్షాలు రాజకీయాలు పక్కనపెట్టి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ప్రకృతి విపత్తును ఎదుర్కోవడానికి అందరి భాగస్వామ్యం అవసరమని, దుష్ప్రచారాలను నమ్మకుండా సంయమనంతో వ్యవహరించాలని సూచించారు. ప్రజల్లో కరవు పరిస్థితులపై అవగాహన కల్పించేందుకు మీడియా, కళాకారులు, క్రీడాకారులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

### 12 లక్షల ఎకరాలకు నష్టం జరిగే ప్రమాదం

రాష్ట్రంలో నీటి నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయని సీఎం వివరించారు. కృష్ణా బేసిన్‌లో నీటి నిల్వలు 72 శాతం, గోదావరి బేసిన్‌లో 40 శాతం తక్కువగా ఉన్నాయని తెలిపారు. చలికాలం ప్రారంభం కాకముందే జలాశయాలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రిజర్వాయర్ల నుంచి సుమారు 24 వేల గ్రామాలకు తాగునీరు సరఫరా చేయాల్సి ఉందని, నీటి కొరత కారణంగా 12 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని చెప్పారు. హైదరాబాద్‌కు నీరు అందించే జలాశయాల్లోనూ నీటి నిల్వలు తగ్గిపోయాయని తరువాయి 2లో

# విదేశీ బొగ్గు దిగుమతిలో రూ.3 వేల కోట్ల స్కాం

రేవంత్ సర్కారు కుట్ర పన్నింది: కేటీఆర్ ఆరోపణ

- భోత్రా లాజిస్టిక్స్ ఒప్పందాలపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలి
- సీఎం, డిప్యూటీ సీఎం, కేంద్ర మంత్రికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నేత బహిరంగ లేఖలు



**హైదరాబాద్:** విదేశీ బొగ్గు దిగుమతుల ముసుగులో రూ.3 వేల కోట్ల భారీ కుంభకోణానికి రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్నిందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. కావాలనే బొగ్గు కొరత, విద్యుత్ సంక్షోభాన్ని సృష్టించి.. ఆ పరిస్థితులను అనుకూలంగా మలచుకుని తమకు నచ్చిన కంపెనీకి కాంట్రాక్టులు అప్పగించారని విమర్శించారు. 'భోత్రా లాజిస్టిక్స్' సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి చేసుకున్న ఒప్పందాలు, టెండర్ల వివరాలు, ఇప్పటివరకు చేసిన చెల్లింపులన్నింటినీ బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి గురువారం వేర్వేరుగా బహిరంగ లేఖలు రాశారు. దేశంలో బొగ్గు వనరులు అందుబాటులో ఉండటంతో పాటు సింగరేణికి ఉత్పత్తి సామర్థ్యం ఉన్నప్పటికీ.. దేశీయ బొగ్గు సరఫరాను పెంచే చర్యలు తీసుకోకుండా విదేశీ దిగుమతులపై ఆధారపడటంపై అనుమానాలు తరువాయి 2లో

## 24 లక్షల ఎకరాల అటవీ భూమి ఏమైంది?



- భూముల లెక్కల్లో భారీ వ్యత్యాసం.. ప్రభుత్వం సమాధానం చెప్పాలి
- ప్రభుత్వ, అసైన్డ్ భూములు అన్యాక్రాంతం
- ధరణి నుంచి భూభారతి వరకు పేర్లే మారాయి.. అక్రమాలు ఆగలేదు
- ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

2

# సింగరేణి ప్రైవేటీకరణ ప్రసక్తే లేదు

- కార్మికులు, ప్రజలు ఆందోళన చెందొద్దు
- బీఆర్ఎస్ హయాంలో సంస్థకు భారీగా బకాయిలు
- ఆధారాలు లేకుండా దుష్ప్రచారం చేస్తే సహించం
- ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



**హైదరాబాద్:** సింగరేణి సంస్థను ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. సంస్థను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తున్నారంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని కొట్టిపారేశారు. సింగరేణి భవిష్యత్తుపై కార్మికులు, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. సీఎల్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై మంత్రి తీవ్ర విమర్శలు చేశారు. పదేళ్ల పాలనలో సింగరేణిని కేసీఆర్ కుటుంబం సొంత సంస్థలా మార్చుకుందని ఆరోపించారు. ఆ ప్రభుత్వ హయాంలో కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, సంస్థకు భారీగా బకాయిలు పేరుకుపోయేలా చేసి ఆర్థికంగా దెబ్బతీశారని తరువాయి 2లో



# మీ పాలనే పెద్ద విపత్తు

- సంక్షోభానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం
- వైఫల్యాలను అధికారులపైకి నెడుతున్నారు
- కరెంటు కోతలపై సీఎం తీరును తప్పుబట్టిన మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

**హైదరాబాద్:** తెలంగాణలో విద్యుత్ సంక్షోభంపై రాజకీయ విమర్శలు తీవ్రమయ్యాయి. రాష్ట్రంలో కరెంటు కోతలకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ఆరోపించారు. తన ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులపై నెపం నెడుతున్నారని విమర్శించారు. అధికారుల ఉద్యోగాలు తీసేస్తామని హెచ్చరించే బదులు.. విద్యుత్ రంగంపై ప్రభుత్వం తన బాధ్యతను గుర్తించాలని హితవు పలికారు. రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభాన్ని ముందుగానే అంచనా వేసి తగిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని హరీశ్‌రావు మండిపడ్డారు. కనీసం బొగ్గు నిల్వలను సిద్ధం చేసుకోలేదని, విద్యుత్ రంగంపై సరైన సమీక్షలు నిర్వహించలేదని ఆరోపించారు. ఎల్‌నినో ప్రభావంపై వాతావరణ శాఖ, శాస్త్రవేత్తలు తొమ్మిది నెలలుగా హెచ్చరిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. ఇప్పుడు విద్యుత్ కోతలు మొదలయ్యాక అధికారులను సస్పెండ్ చేస్తామంటూ బెదిరించడం సమంజసం కాదన్నారు.

### అధికారులపై నెపం నెడుతున్నారు

నిషేధిత భూముల జాబితా వ్యవహారంలోనూ ప్రభుత్వం చేసిన తప్పులను అధికారులపైకి నెట్టిందని హరీశ్‌రావు ఆరోపించారు. ఇప్పుడు విద్యుత్ సంక్షోభం విషయంలోనూ అదే వైఖరిని అవలంబిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ నిర్ణయాలు, ముందస్తు ప్రణాళిక లోపాలపై సమాధానం చెప్పకుండా అధికారులను బాధ్యులను చేయడం సరికాదని అన్నారు.

### మీ పాలనే పెద్ద విపత్తు

ఎల్‌నినో పరిస్థితులను కొవిడ్ వంటి విపత్తుతో సీఎం రేవంత్‌రెడ్డి పోల్చడంపై తరువాయి 2లో



# కమీషన్ల దందాకు అడ్డాగా సీఎంఓ

- ప్రతి పనికి 15 శాతం కమీషన్ కోసం బెదిరింపులు సిగ్గుచేటు
- కాంగ్రెస్‌ది ప్రజాపాలన కాదు.. దోపిడీ, లూటీ పాలన
- మహారాష్ట్ర తరహాలో మహిళా రైతుల సాధికారత చట్టం తేవాలి
- తెలంగాణ రక్షణ చీఫ్ కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్:** ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) కమీషన్ల దందాకు అడ్డాగా మారిందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ప్రతి పనికి 15 శాతం కమీషన్ ఇవ్వాలంటూ సీఎంఓ నుంచే బెదిరింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఇది సిగ్గుచేటని గురువారం 'ఎక్స్' వేదికగా మండిపడ్డారు. తమ అనుచరులు, ఆప్తులకు ప్రయోజనం చేకూర్చేందుకు చట్టాలు, నిబంధనలను పక్కనపెడుతున్నారని ఆరోపించారు. ఎలాంటి అర్హతలు లేని వారికి కేవలం కమీషన్ల కోసమే పనులు అప్పగిస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వానిది ప్రజాపాలన తరువాయి 2లో



భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం

## తొలి దశ ఖరారు

- చట్టపరమైన ముసాయిదా రూపకల్పన పూర్తి కావస్తోంది
- త్వరలోనే ఒప్పందంపై సంతకాలు: కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్

2

# రాహుల్ గాంధీపై సుప్రీం ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

మంది కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం సర్ ప్రక్రియలో ఎన్నికల సంఘం వ్యవహరిస్తున్న తీరును ప్రశ్నిస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై తాజాగా విచారణ చేపట్టిన ధర్మాసనం కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. అయితే, నోటీసులు జారీ చేసినంత మాత్రాన రాజకీయ నాయకుల ప్రవర్తనను సమర్థించినట్లు కాదని స్పష్టం చేసింది.

### కోర్టుపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలు

న్యాయస్థానం వరకు రాజకీయ పాదయాత్రలు చేపట్టడం ఆమోదయోగ్యం కాదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఇలాంటి చర్యలు పునరావృతం కాకూడదని పేర్కొంది. న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరని, నిరసనల ద్వారా కోర్టుపై ఒత్తిడి తీసుకురావడానికి ప్రయత్నించకూడదని స్పష్టం చేసింది. ఈ వ్యవహారానికి సంబంధించి దాఖలైన పిటిషన్ల విచారణలో భాగంగా రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్‌కు నోటీసులు జారీ చేసింది. కోర్టు ప్రాంగణంలో జరిగిన నిరసనలకు సంబంధించిన వీడియో రికార్డింగ్‌లను భద్రపరచాలని పోలీసులను ఆదేశించింది.

# సింగరేణి ప్రైవేటీకరణ ప్రసక్తే లేదు

(మొదటి పేజీ తరువాయి)



విమర్శించారు. గతంలో సంస్థను నిర్వీర్యం చేసిన నాయకులు ఇప్పుడు కార్మికుల సంక్షేమం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. సింగరేణి ప్రతిష్ఠను దెబ్బతీసే లక్ష్యంతోనే బీఆర్ఎస్ నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారని శ్రీధర్‌బాబు మండిపడ్డారు. ఆధారాలు లేని విమర్శలను కార్మికులు, ప్రజలు పట్టించుకోవద్దని సూచించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే సింగరేణిని కాపాడిందని, ఇప్పుడు కూడా సంస్థ ప్రయోజనాలను పరిరక్షించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

### యాదాద్రి ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో నడిపిస్తాం

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో నడిపిస్తామని శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. వాస్తవాలను తెలుసుకోకుండా, ఎలాంటి ఆధారాలు లేకుండా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సింగరేణి విషయంలో కార్మికుల ప్రయోజనాలు, సంస్థ భవిష్యత్తుకు తమ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని తెలిపారు.

# మీ పాలనే పెద్ద విపత్తు

(మొదటి పేజీ తరువాయి)

హరీశ్‌రావు స్పందించారు. ప్రకృతి పరిస్థితులను విపత్తుగా అభివర్ణిస్తున్న ముఖ్యమంత్రి.. తన పాలనే ప్రజలకు పెద్ద విపత్తుగా మారిందనే విషయాన్ని ఎందుకు గుర్తించడం లేదని ప్రశ్నించారు. అధికారుల ఉద్యోగాలు తీసేస్తామని హెచ్చరించే ముందు విద్యుత్ సంక్షోభానికి దారితీసిన కారణాలను గుర్తించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

## భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం
# తొలి దశ ఖరారు!



**న్యూఢిల్లీ:** భారత్, అమెరికా మధ్య ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి సంబంధించి తొలి దశ ఖరారైందని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. ప్రస్తుతం ఒప్పందానికి సంబంధించిన చట్టపరమైన ముసాయిదా రూపకల్పన జరుగుతోందని తెలిపారు. దిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు.

వాణిజ్య ఒప్పందానికి అవసరమైన చట్టపరమైన ముసాయిదా తుది దశకు చేరుకుందని వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ తెలిపారు. వీలైనంత త్వరగా ఒప్పందంపై సంతకాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. అయితే, అమెరికా విధించే సుంకాలపై అధికారికంగా స్పష్టత వచ్చిన తర్వాతే ఇరు దేశాలు ఒప్పందంపై సంతకాలు చేస్తాయని వెల్లడించారు.

# సీజేపీ నిరసనలకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్!

- కనాట్‌ప్లేస్‌లో ఆందోళనలను అడ్డుకునేందుకు నిరాకరణ
- వ్యాపారులు, ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా భద్రతా చర్యలు
- అక్టోబర్ 16, 17 తేదీల్లో సెంట్రల్ పార్క్ మూసివేత

**న్యూఢిల్లీ:** కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సీఈసీ) రాజీనామా చేయాలని, ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీజేపీ అక్టోబర్ 16న దిల్లీలోని కనాట్‌ప్లేస్‌లో నిరసనలకు సిద్ధమైంది. ఈ ఆందోళనలను అడ్డుకోవాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను దిల్లీ హైకోర్టు తోసిపుచ్చింది. నిరసనల సందర్భంగా స్థానిక వ్యాపారులకు, ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా తగిన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు పోలీసులు న్యాయస్థానానికి వివరించారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు నిరసనలను నిలువరించేందుకు నిరాకరించింది. దేశభక్తులంతా శుక్రవారం (అక్టోబర్ 16) త్రివర్ణ పతాకాలు చేతబట్టి కనాట్‌ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్ వద్దకు రావాలని దీప్ పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో కనాట్‌ప్లేస్ ప్రాంతానికి చెందిన ఓ వీధి వ్యాపారి హైకోర్టును ఆశ్రయించారు. ఆంక్షల కారణంగా కీలకమైన పండగ సమయాల్లో తమ ఉపాధి దెబ్బతింటోందని పిటిషన్‌లో పేర్కొన్నారు. నిరసనల వల్ల వ్యాపారులకు ఇబ్బందులు కలగకుండా ఆందోళనలను నియంత్రించేలా పోలీసులను ఆదేశించాలని కోరారు.

### భద్రతా ఏర్పాట్లపై పోలీసుల దృష్టి

మరోవైపు, దిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ సెంట్రల్ పార్క్‌ను అక్టోబర్ 16, 17 తేదీల్లో నిర్వహణ పనుల కారణంగా మూసివేయాలని నిర్ణయించినట్లు సమాచారం. సీజేపీ నిరసనలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో కనాట్‌ప్లేస్ పరిసరాల్లో శాంతిభద్రతలను కాపాడటంతో పాటు, వీధి వ్యాపారుల ఉపాధికి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకునేందుకు పోలీసులు ఏర్పాట్లు చేస్తున్నారు. ట్రాఫిక్ నియంత్రణపైనా దృష్టి సారించారు.

# 44 ఏళ్ల నిరీక్షణకు తెర.. మహిళల హాకీకి స్వర్ణ కాంతులు!

- ఆసియా క్రీడల విజేతలతో ప్రధాని మోదీ భేటీ
- పురుషుల, మహిళల హాకీ జట్ల స్వర్ణ విజయంపై హర్షం
- క్రీడల్లో పారదర్శక వ్యవస్థను తీసుకొచ్చాం
- 2036 ఒలింపిక్స్‌కు ఆతిథ్యమే లక్ష్యం



**న్యూఢిల్లీ:** సంకల్పం, కలలు ఒక్క రోజులో సాకారం కావని, వాటి కోసం ఏళ్ల తరబడి కఠోర శ్రమ, అంకితభావం అవసరమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఇటీవల జపాన్‌లో జరిగిన ఆసియా క్రీడల్లో పతకాలు సాధించిన భారత క్రీడాకారులతో దిల్లీలోని మేజర్ ధ్యాన్‌చంద్ స్టేడియంలో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విజేతలను అభినందించారు. ముఖ్యంగా 44 ఏళ్ల తర్వాత మహిళల హాకీ జట్టు స్వర్ణ పతకం సాధించడం చారిత్రాత్మకమని కొనియాడారు. పురుషుల జట్టు కూడా స్వర్ణం గెలవడంపై హర్షం వ్యక్తం చేశారు.

### క్రీడాకారుల విజయం దేశ ప్రజలందరిదీ

గత 12 ఏళ్లలో క్రీడారంగంలో పారదర్శక వ్యవస్థను తీసుకొచ్చేందుకు కృషి చేశామని మోదీ తెలిపారు. ఒకప్పుడు అంతర్జాతీయ పోటీల్లో భారత్ తక్కువ పతకాలకే పరిమితమయ్యేదని, ప్రస్తుతం ప్రపంచ వేదికపై భారత క్రీడాకారుల ప్రాతినిధ్యం పెరుగుతోందని పేర్కొన్నారు. యువత ధైర్యం, పట్టుదలతో ఏ లక్ష్యాన్నైనా సాధించగలరని అన్నారు. ఆసియా క్రీడల్లో భారత మహిళా అథ్లెట్లు 38 పతకాలు సాధించగా, వాటిలో 11 స్వర్ణాలు ఉన్నాయని మోదీ గుర్తుచేశారు. ఈ విజయాలు 140 కోట్ల మంది భారతీయుల్లో గర్వాన్ని నింపాయని చెప్పారు. క్రీడాకారులు సాధించిన విజయాలు వ్యక్తిగతమైనవి మాత్రమే కాదని, యావత్ దేశానికి చెందినవని పేర్కొన్నారు. అంతర్జాతీయ క్రీడా పోటీలకు విశ్వసనీయ ఆతిథ్య దేశంగా భారత్ ఎదుగుతోందని తెలిపారు. 2036 ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇచ్చేందుకు భారత్ బిడ్ వేస్తోందని, ఆ లక్ష్య సాధనకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.

ఆసియా క్రీడల్లో రెండు స్వర్ణ పతకాలు సాధించిన ఆర్చరీ క్రీడాకారిణి కుంకుమ్ మొహోద్ తన విల్లును ప్రధాని మోదీకి బహూకరించారు. వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఛైర్మన్ జై షా, భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పి.టి. ఉష పాల్గొన్నారు.

### భారత ఖాతాలో 21 స్వర్ణాలు

ఇటీవల జపాన్‌లో జరిగిన ఆసియా క్రీడల్లో భారత్ 21 స్వర్ణాలతో సహా మొత్తం 85 పతకాలు సాధించింది. గతంలో హాంగ్‌జౌలో జరిగిన క్రీడల్లో సాధించిన 106 పతకాలతో పోలిస్తే ఈసారి సంఖ్య తగ్గింది. అయితే తొలిసారిగా పోటీల్లో పాల్గొన్న భారత జట్లు 41 పతకాలు సాధించడం విశేషం.

ఈ కార్యక్రమానికి భారత పురుషుల, మహిళల టీ20 జట్ల సభ్యులు కూడా హాజరయ్యారు. వెస్టిండీస్‌తో మ్యాచ్ ఆడేందుకు సిద్ధమైన శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని పురుషుల జట్టు, జింబాబ్వేతో టీ20 మ్యాచ్ కోసం సిద్ధమవుతున్న మహిళల జట్టు సభ్యులు పాల్గొన్నారు. ఇటీవల కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకున్న హర్మన్‌ప్రీత్ కౌర్ కూడా హాజరయ్యారు. మహిళల జట్టు సభ్యుల సంతకాలతో కూడిన జెర్సీని ప్రధానికి అందించారు. కొత్త కెప్టెన్ స్మృతి మంధానతో కలిసి హర్మన్‌ప్రీత్ ఫొటోలు దిగారు.

# అమెరికాలో హిందూ ఆలయంపై కాల్పుల కుట్ర కలవరపరిచింది

- హిందూ వ్యతిరేక, జాతి వివక్ష కోణాలు: భారత్
- సిటిజన్ భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలి
- రైఫిల్ జామ్ కావడంతో తప్పిన ముప్పు

**న్యూఢిల్లీ:** అమెరికాలోని హిందూ ఆలయంపై కాల్పులకు కుట్ర పన్నిన ఘటనపై భారత ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఘటన వెనుక హిందూ వ్యతిరేక, జాతి వివక్ష కోణాలు ఉన్నట్లు కనిపిస్తోందని పేర్కొంది. భారతీయుల భద్రతకు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. ఈ మేరకు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మీడియాతో మాట్లాడారు. అమెరికాలోని ఇల్లినాయీ రాష్ట్రం అరోరా శివారు ప్రాంతంలో ఉన్న హిందూ ఆలయాన్ని లక్ష్యంగా చేసుకుని కాల్పులకు కుట్ర పన్నినట్లు వచ్చిన నివేదికలు తమ దృష్టికి వచ్చాయని జైస్వాల్ తెలిపారు. ఈ ఘటన తీవ్ర కలవరానికి గురిచేసిందని పేర్కొన్నారు. కుట్ర వెనుక జాతి వివక్ష, హిందూ వ్యతిరేక ధోరణులు ఉన్నట్లు తెలుస్తోందని వ్యాఖ్యానించారు. అమెరికాలో నివసిస్తున్న భారతీయుల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ కేసులో నిందితుడు అలెగ్జాండ్రోస్ పపోరాకిస్ భారతీయులను లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరపాలనే ఉద్దేశంతో ఆలయానికి వెళ్లినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. అయితే, అతడి రైఫిల్ జామ్ కావడంతో కాల్పుల కుట్ర విఫలమైనట్లు సమాచారం.తనతో కలిసి రెస్టారెంట్‌లో పనిచేసే స్నేహితుడికి నిందితుడు ఫోన్ చేసి, కాల్పులు జరపాలనుకున్న విషయంతో పాటు తుపాకీ పనిచేయకపోవడం గురించి చెప్పడంతో ఈ కుట్ర వెలుగులోకి వచ్చినట్లు కథనాలు వెల్లడించాయి. ఈ ఘటనపై అమెరికా అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# యాసంగిలో వరి వేయొద్దు

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించారు.

### అక్టోబర్‌లోనే మార్చి ఎండలు

ఎండల తీవ్రత కారణంగా విద్యుత్ వినియోగం అనూహ్యంగా పెరిగిందని రేవంత్‌రెడ్డి తెలిపారు. సాధారణ వినియోగానికి అదనంగా రోజుకు సుమారు 5 వేల మెగావాట్ల విద్యుత్ అవసరం పెరిగిందని పేర్కొన్నారు. మార్చిలో ఉండాల్సిన ఎండలు అక్టోబర్‌లోనే కనిపిస్తున్నాయని, ఈ నెలలో ఇంత భారీ స్థాయిలో విద్యుత్ వినియోగం గతంలో ఎప్పుడూ లేదని చెప్పారు. మార్కెట్‌లో ఏ ధరకు విద్యుత్ లభించినా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వివరించారు. తాగునీరు, సాగునీటి తో పాటు విద్యుత్ సమస్యనూ ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

### కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీటిపై ఆరోపణలు

కొండపోచమ్మ సాగర్ నుంచి పంచపాండవుల చెరువుకు కాలువ తవ్వి, అక్కడి నుంచి మోటార్ల ద్వారా కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీటిని తరలిస్తున్నారని సీఎం ఆరోపించారు. రాష్ట్రంలో మరెవరికీ లేని ప్రత్యేక వెసులుబాటు ఫామ్‌హౌస్‌కు ఎందుకని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై నిజనిర్ధారణకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మాణ వ్యయంపైనా రేవంత్‌రెడ్డి ప్రశ్నలు లేవనెత్తారు. సూపర్ క్రిటికల్ సాంకేతికతతో ఈ కేంద్రాన్ని రూ.17,950 కోట్లతో నిర్మించేందుకు ఒప్పందం చేసుకోగా, అంచనాలు రూ.37,781 కోట్లకు పెరిగాయని పేర్కొన్నారు. వ్యయం 110 శాతం



పెరగడానికి కారణాలేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కేంద్రంలో అక్రమాలు ఉన్నాయని ఇంజినీర్ రఘు మొదటి నుంచీ చెబుతున్నారని గుర్తుచేశారు.

### కేబినెట్ ఉపసంఘం ఏర్పాటు

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని సీఎం తెలిపారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేస్తామని, నోడల్ అధికారిగా రామకృష్ణారావును నియమిస్తున్నామని వెల్లడించారు. సమస్య పరిష్కారానికి కేబినెట్ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. దసరా తర్వాత ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఎల్‌నినో పరిస్థితులపై రామకృష్ణారావు సమావేశంలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. విపత్తును ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై రాజకీయ పార్టీలతోనూ చర్చించనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.

# విదేశీ బొగ్గు దిగుమతిలో రూ.3 వేల కోట్ల స్కాం

(మొదటి పేజీ తరువాయి)



వ్యక్తమవుతున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. గనుల అభివృద్ధి, ఉత్పత్తి లక్ష్యాలు, బొగ్గు నిల్వలు, రవాణా, దీర్ఘకాలిక సరఫరా ఒప్పందాలపై ముందస్తు ప్రణాళిక రూపొందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. విద్యుత్ సంక్షోభాన్ని ముందుగానే అంచనా వేసి తగిన చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం.. ఇప్పుడు కరెంటు కోతలతో ప్రజలు, రైతులు పడుతున్న ఇబ్బందులను సాకుగా చూపి విదేశీ బొగ్గు దిగుమతులకు తెరతీసిందని ఆరోపించారు.

### టన్నుకు రూ.1,500 కమీషనా?

విదేశీ బొగ్గు దిగుమతుల వ్యవహారంలో టన్నుకు రూ.1,500 చొప్పున కమీషన్ తీసుకునేలా ఒప్పందాలు చేసుకున్నట్లు సమాచారం ఉందని కేటీఆర్ ఆరోపించారు. ఈ లెక్కన రూ.3 వేల కోట్ల మేర అక్రమాలకు కుట్ర జరిగిందని విమర్శించారు. ఇన్నాళ్లూ కనీసం సమీక్ష సమావేశాలు నిర్వహించకుండా, ఇప్పుడు హడావుడిగా విదేశీ బొగ్గు దిగుమతుల ప్రక్రియను చేపట్టడం వెనుక ఉద్దేశమేంటని ప్రశ్నించారు.

### భోత్రా లాజిస్టిక్స్‌కు కాంట్రాక్టులెలా?

సింగరేణిలో భోత్రా లాజిస్టిక్స్ సంస్థకు కాంట్రాక్టులు అప్పగించేందుకు అనుసరించిన విధానాలు, ఎంపిక ప్రమాణాలను ప్రభుత్వం వెల్లడించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆ సంస్థకు ఏ అర్హతల ఆధారంగా కాంట్రాక్టులు కట్టబెట్టారో స్పష్టం చేయాలన్నారు. ఇప్పటివరకు అప్పగించిన పనులు, చేసిన చెల్లింపులపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని కోరారు. విదేశీ బొగ్గు దిగుమతులకు సంబంధించిన టెండర్లు, ఒప్పందాలు, చెల్లింపుల వివరాలను ప్రజల ముందు ఉంచాలని లేఖల్లో పేర్కొన్నారు.

# కమీషన్ల దందాకు అడ్డాగా సీఎంఓ

(మొదటి పేజీ తరువాయి)

కాదని, పచ్చి దోపిడీ, లూటీ పాలన అని కవిత విమర్శించారు. ప్రజలకు, వ్యాపారులకు రక్షణగా ఉండాల్సిన ముఖ్యమంత్రి కార్యాలయం నుంచే ఇలాంటి బెదిరింపులు చోటుచేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. తెలంగాణ సమాజం ఈ తరహా వ్యవహారాలను సహించబోదని పేర్కొన్నారు. కమీషన్ల కోసం బెదిరింపులకు పాల్పడుతూ ప్రజలను దోచుకుంటున్న వారిని వదిలిపెట్టబోమని హెచ్చరించారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ దోపిడీకి పాల్పడిన వారందరిపైనా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### మహిళా రైతులకు చట్టబద్ధ గుర్తింపు ఇవ్వాలి

మహిళా రైతుల సాధికారత కోసం మహారాష్ట్ర తరహాలో తెలంగాణలోనూ ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని కవిత డిమాండ్ చేశారు. మహిళా రైతుల దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో మహిళా రైతుల పరిస్థితిపై గురువారం 'ఎక్స్'లో స్పందించారు. కుటుంబ బాధ్యతలను నిర్వహిస్తూనే ఉదయం నుంచి రాత్రి వరకు పొలం, పాడి పనుల్లో శ్రమిస్తున్న మహిళలకు తగిన గుర్తింపు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కీలకంగా నిలుస్తున్న మహిళా రైతుల కష్టాలు, త్యాగాలను గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మహిళా రైతుల సాధికారత చట్టం–2026ను స్ఫూర్తిగా తీసుకుని తెలంగాణలోనూ చట్టం చేయాలని సూచించారు. మహిళా రైతులు, వ్యవసాయ కూలీలకు చట్టపరమైన గుర్తింపు కల్పించడంతోపాటు ప్రభుత్వ పథకాలు, సామాజిక భద్రత ప్రయోజనాలు పొందేలా చర్యలు



తీసుకోవాలని కోరారు. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో మహిళల భాగస్వామ్యాన్ని గుర్తించి, వారి శ్రమకు తగిన గౌరవం కల్పించాలని పేర్కొన్నారు.

# జంతర్‌మంతర్ తొలగింపుపై సుప్రీం నోటీసులు

- కేంద్రం, ఢిల్లీ పోలీసుల వివరణ కోరిన ధర్మాసనం
- సమాధానాలు సంతృప్తికరంగా లేకపోతే చట్టం తన పని తాను చేసుకుపోతుంది
- ప్రత్యామ్నాయ నిరసన వేదికలపై అభ్యంతరాలు

**న్యూఢిల్లీ:** దేశ రాజధానిలోని జంతర్‌మంతర్‌ను నిరసన వేదికల జాబితా నుంచి తొలగించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు గురువారం విచారణ చేపట్టింది. ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం, దిల్లీ పోలీసులకు నోటీసులు జారీ చేసింది. వారి సమాధానాలు సంతృప్తికరంగా లేకపోతే చట్టం తన పని తాను చేసుకుపోతుందని స్పష్టం చేసింది. జంతర్‌మంతర్‌ను నిరసన ప్రదేశాల జాబితా నుంచి తొలగించడానికి గల కారణాలపై ధర్మాసనం ప్రశ్నలు లేవనెత్తింది. గతంలో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలను ఆధారంగా చేసుకుని జంతర్‌మంతర్‌ను నిరసన వేదికగా తొలగించారా? లేక స్వతంత్రంగా ఈ నిర్ణయం తీసుకున్నారా? అని న్యాయస్థానం ప్రశ్నించింది. దీనిపై స్పందించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా.. సుప్రీంకోర్టు వ్యాఖ్యల కారణంగా ఈ నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. ఇందుకోసం



ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగానే మార్పులు చేసినట్లు కోర్టుకు వివరించారు.

### ప్రత్యామ్నాయ వేదికలపై అభ్యంతరాలు

జంతర్‌మంతర్‌కు బదులుగా నిరసనలు నిర్వహించేందుకు రామ్‌లీలా మైదాన్, బురారీ గ్రౌండ్, సీబీడీ గ్రౌండ్ ప్రాంతాలను దిల్లీ పోలీసులు ప్రత్యామ్నాయ వేదికలుగా ప్రకటించారు. ఈ మేరకు అక్టోబరు 11న ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, కొత్తగా గుర్తించిన ప్రాంతాలకు వెళ్లడం ప్రజలకు ఇబ్బందికరంగా మారుతుందని పిటిషనర్లు ఆందోళన వ్యక్తం చేశారు. జంతర్‌మంతర్ అందుబాటులో లేకపోవడంతో తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం కష్టమవుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం, దిల్లీ పోలీసులు సమర్పించే వివరణపై సుప్రీంకోర్టు విచారణలో తదుపరి పరిణామాలు ఆధారపడి ఉండనున్నాయి.

# 24 లక్షల ఎకరాల అటవీ భూమి ఏమైంది?

**హైదరాబాద్:** తెలంగాణలో దాదాపు 24 లక్షల ఎకరాల అటవీ భూమి లెక్కల్లో వ్యత్యాసం కనిపిస్తోందని, ఆ భూమి ఏమైందో ప్రభుత్వం స్పష్టం చేయాలని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో లక్షలాది ఎకరాల ప్రభుత్వ, అసైన్డ్ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని, ప్రముఖ నాయకులే భూకబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భూములకు సంబంధించిన గణాంకాలను వివరించారు. అధికారిక రికార్డుల ప్రకారం రాష్ట్రంలో 66,33,313 ఎకరాల అటవీ భూమి ఉండాల్సి ఉండగా.. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించిన లెక్కల ప్రకారం 42.53 లక్షల ఎకరాలు మాత్రమే ఉన్నట్లు మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ రెండు గణాంకాల మధ్య భారీ వ్యత్యాసం ఉండటంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అటవీ భూముల లెక్కల్లో ఇంత తేడా ఎందుకు వచ్చిందో వివరించాలని కోరారు.

### పేదల భూములను విక్రయిస్తారా?

ప్రభుత్వం అసైన్డ్ భూముల విక్రయానికి సిద్ధమవుతోందని మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. అదే జరిగితే పేదలకు తీవ్ర అన్యాయం చేసినట్లేనని విమర్శించారు. ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూముల పరిరక్షణపై ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

### పేర్లు మారినా.. అక్రమాలు ఆగలేదు

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమల్లో ఉన్న ధరణి పోర్టల్ స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతిని తీసుకొచ్చినా.. భూ సమస్యలు, అక్రమాలు మాత్రం కొనసాగుతున్నాయని మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. పోర్టల్ పేరు మార్చినంత మాత్రాన భూ రికార్డుల్లో పారదర్శకత వచ్చినట్లు కాదన్నారు. గతంలో న్యాయస్థానం రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేసిన సెక్షన్ 22ఏను కొన్ని సవరణలతో కొనసాగించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై సీబీఐ విచారణ జరిపించేందుకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు వెనుకాడుతోందని ప్రశ్నించారు. రాష్ట్రంలోని అటవీ, ప్రభుత్వ, అసైన్డ్ భూముల లెక్కలను



పారదర్శకంగా వెల్లడించి, అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.



# కొత్త రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

o 17వ వార్డులో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ
o ప్రజా సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
o త్వరలో ఇందిరమ్మ బీమా పథకం అమలు
o వార్డును దశలవారీగా అభివృద్ధి చేస్తాం: కౌన్సిలర్ ఉమామహేశ్వరి

**తొలివెలుగు,చౌటుప్పల్:** పురపాలక సంఘం పరిధిలోని 17వ వార్డులో గురువారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ చింతల ఉమామహేశ్వరి సాయిలు, కో-ఆప్షన్ సభ్యుడు పస్తం గంగారాములు లబ్ధిదారులకు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఉమామహేశ్వరి మాట్లాడుతూ.. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుతో పాటు త్వరలో ఇందిరమ్మ బీమా పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. దేశంలో మరెక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తోందని అన్నారు. కొత్త రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, ఇప్పటివరకు రేషన్ కార్డులు పొందని అర్హులు మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ సహకారంతో పాటు వార్డు ప్రజల భాగస్వామ్యంతో 17వ వార్డును దశలవారీగా అభివృద్ధి చేస్తామని కౌన్సిలర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు గుజ్జుల సురేందర్‌రెడ్డి, జవహర్ బాల్ మంచ్ రాష్ట్ర సమన్వయకర్త పెద్దగోని రమేష్ గౌడ్, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి మాదాని గోపాల్, కాంశెట్టి భాస్కర్, ఐఎన్‌టీయూసీ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాల గణేష్ కుమార్, ఓర్సు రాజు, వీరమల్ల సత్తయ్య, బొజ్జ రాజు, రెవెన్యూ జీపీఓ నాగభూషణం, ధనలక్ష్మి, యర్రబోత్ దయాకర్‌రెడ్డి, కళ్లెం సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డులతో మరింత పారదర్శక సేవలు

o 20వ వార్డులో లబ్ధిదారులకు కార్డుల పంపిణీ
o పాల్గొన్న కౌన్సిలర్ హన్నుబాయ్, కో-ఆప్షన్ సభ్యులు బాబాషరీఫ్



**తొలివెలుగు, చౌటుప్పల్ :** ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి పారదర్శకంగా అందాలనే లక్ష్యంతో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ వేగవంతం చేసినట్లు చౌటుప్పల్ పురపాలక సంఘం 20వ వార్డు కౌన్సిలర్ ఎం.డి. హన్నుబాయ్ తెలిపారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని బంగారిగడ్డ 20వ వార్డులో గురువారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ హన్నుబాయ్, కో-ఆప్షన్ సభ్యులు ఎం.డి. బాబాషరీఫ్ లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ.. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రజలకు ప్రభుత్వ రేషన్ సేవలు మరింత సులభంగా, వేగవంతంగా అందుబాటులోకి వస్తాయన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు త్వరగా అందేలా కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో 20వ వార్డు అధ్యక్షుడు ఉడుగు వెంకటేశం గౌడ్, కాంగ్రెస్ పార్టీ కమిటీ వైస్ చైర్మన్ ఎం.డి. వహీద్, మాజీ చైర్మన్ ఎం.డి. ఎజాజ్ పాషా, ఎం.డి. ఇబ్రహీం, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, మహిళా లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా దుర్గామాత పూజలు

o అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన సర్పంచ్ సాయికుమార్ గౌడ్
o గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్ష

**తొలివెలుగు, రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం భోగారం గ్రామంలో శ్రీ రాఘవేంద్ర యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో గ్రామ సర్పంచ్ కూనూరు సాయికుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గురువారం దుర్గామాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, గ్రామం సుభిక్షంగా ఉండటంతో పాటు అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీ రాఘవేంద్ర యూత్ సభ్యులు, ఉత్సవ నిర్వాహకులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.



# ఘనంగా కట్ట మైసమ్మ కల్యాణం





o నూతన ఆలయంలో బోనాల పండుగ.. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు
o ఉత్సవాలకు హాజరై అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి
o తెలంగాణ సంస్కృతిలో సంప్రదాయాలు, పండుగలు భాగం: ఎమ్మెల్యే

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** మన సంప్రదాయాలు, పండుగలు తెలంగాణ సంస్కృతిలో అంతర్భాగమని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలోని పెద్ద చెరువు కట్ట వద్ద నూతనంగా నిర్మించిన కట్ట మైసమ్మ తల్లి ఆలయంలో గురువారం నిర్వహించిన అమ్మవారి కల్యాణం, బోనాల మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉదయాన్నే అమ్మవారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించి, అనంతరం బలిగంప కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలోని మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలను తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ఆలయ పరిసరాలు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లుతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాలతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు ముప్పిడి శ్రీనివాస్, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు భారత లవకుమార్, పోచంపల్లి, జూలూరు పీఏసీఎస్ చైర్మన్ పాక మల్లేష్ యాదవ్, కళ్లెం రాఘవరెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వంగూరు పాండు, మండల అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

o పని ఒత్తిడిని తగ్గించుకోవడానికి ధ్యానం ఎంతో ఉపయోగకరం
o నూతన పిరమిడ్ ధ్యాన మందిరానికి భూమిపూజ
o ఎకరం భూమి దానం చేసిన దాతలను అభినందించిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** నిత్య జీవితంలో పని ఒత్తిడిని తగ్గించుకొని సంపూర్ణ ఆరోగ్యం పొందేందుకు ధ్యానం ఎంతగానో దోహదపడుతుందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. మానసిక ప్రశాంతతతో పాటు ఆరోగ్యకరమైన జీవనం కోసం ప్రతి ఒక్కరూ ధ్యానాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలో గురువారం పోచంపల్లి స్పిరిచువల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించనున్న నూతన పిరమిడ్ ధ్యాన మందిరానికి నిర్వహించిన భూమిపూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భూమిపూజలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు ధ్యానం ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. ప్రజల ఆరోగ్యం, మానసిక ప్రశాంతత కోసం ఇంత పెద్ద ధ్యాన మందిరాన్ని నిర్మించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ మహత్తర కార్యక్రమం కోసం ఎకరం భూమిని దానం చేసిన మెరుగు గోపాల్, చైతన్యలత దంపతులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, ధ్యాన మందిర నిర్వాహకురాలు పూల లత నర్సింహ, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు భారత లవకుమార్, జాతీయ బీసీ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యనారాయణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వంగూరు పాండు, మాజీ ఇన్‌ఛార్జి సర్పంచ్ గడ్డం వెంకటేష్, నాయకుడు శెట్టి శ్రీనివాస్, నిర్వాహక బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# నోటీసులు లేకుండానే ఉపాధి నిర్మూలనా?

o జలాల్‌పురంలో 12 నిర్మాణాల కూల్చివేత
o 40 మంది పోలీసులతో రెవెన్యూ అధికారుల రాత్రిపూట ఆపరేషన్
o బాధితులకు అండగా ఉంటాం: బీఆర్ఎస్ నేతలు

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** పాత ఇనుప సామాను వ్యాపారంతో పొట్టపోసుకుంటున్న బుడిగ జంగాల ఉపాధిపై రెవెన్యూ అధికారులు ఉక్కుపాదం మోపారు. జలాల్‌పురం గ్రామం సర్వే నంబర్ 80 లో ఉన్న గజేంద్ర కాలనీలో ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా అర్ధరాత్రి వేళ 12 నిర్మాణాలను రెవెన్యూ సిబ్బంది నేలమట్టం చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు భువనగిరి రూరల్ సీఐ సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 40 మంది పోలీసులతో పహారా కాసి ప్రీ-కాస్ట్ నిర్మిత గోడలను కూల్చివేశారు. తమ వృత్తి సామగ్రిని దాచుకునేందుకు చేసుకున్న ఏర్పాట్లను అక్రమ నిర్మాణాలుగా భావించి కూల్చేయడంతో బాధితులు రోదనలు మిన్నంటాయి.



**అండగా ఉంటామన్న బీఆర్ఎస్ నేతలు:**

సంఘటనా స్థలానికి చేరుకున్న బీఆర్ఎస్ మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి, స్థానిక నాయకులు బాధితుల వద్దకు వెళ్లి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు తమ జీవనోపాధి కోసం పాత ఇనుప సామగ్రిని భద్రపరుచుకునేందుకు మాత్రమే నిర్మాణాలు ఏర్పాటు చేసుకున్నామని వేసుకున్న షెడ్లను ఇలా కూల్చేయడం ఘోరమని బాధితులు కన్నీటిపర్యంతమయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మాట్లాడుతూ.. పేదల పొట్టకొట్టే చర్యలను ఖండిస్తున్నామని, బాధితులకు బీఆర్ఎస్ పార్టీ అన్ని విధాలా అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. అర్హులైన వారందరికీ చట్టబద్ధంగా పట్టాలు వచ్చేలా పోరాడతామన్నారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అర్హులైన వారికి పట్టాలు అందించేలా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శాపాక లింగస్వామి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ కందడి భూపాల్‌రెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పాటి సుధాకర్‌రెడ్డి, ఉపసర్పంచ్ కేసారం మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బత్తుల శ్రీశైలం గౌడ్, నాయకులు దర్శన్ తదితరులు పాల్గొన్నారు.





# హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

- రూ.10 వేల జరిమానా.. మరో కేసులో ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష
- నాణ్యమైన దర్యాప్తుతోనే నేరస్తులకు శిక్షలు: జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్

**తొలివెలుగు, రాజాపేట :** హత్య కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి భువనగిరి 1వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జీవిత ఖైదు విధిస్తూ గురువారం తీర్పు వెలువరించింది. రాజాపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఈ కేసులో పకడ్బందీ దర్యాప్తు, ఆధారాల సమర్పణతో న్యాయస్థానంలో శిక్ష ఖరారైనట్లు పోలీసులు తెలిపారు. రాజాపేట పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 196/2024గా భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్లు 103, 308(4) కింద కేసు నమోదైంది. దీనికి సంబంధించి సెషన్స్ కేసు నంబర్ 22/2026లో భువనగిరి 1వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి మిలింద్ కాంబ్లే అక్టోబర్ 15న తీర్పు ప్రకటించారు. రాజాపేట మండలం రఘునాథపురం గ్రామానికి చెందిన వడ్లకొండ నాగరాజు (40), తండ్రి బాలరాంపై నేరం రుజువు కావడంతో శిక్ష విధించారు. బీఎన్ఎస్ సెక్షన్ 103 కింద జీవిత ఖైదుతో పాటు



రూ.10 వేల జరిమానా, సెక్షన్ 308(4) కింద ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించినట్లు పోలీసులు వెల్లడించారు.

**దర్యాప్తు బృందానికి ఎస్పీ అభినందనలు:**

ఈ కేసులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బొబ్బల కేశవరెడ్డి ప్రాసిక్యూషన్ తరఫున వాదనలు వినిపించారు. మొదటి దర్యాప్తు అధికారిగా ఇన్‌స్పెక్టర్ ఎం. రమేష్, రెండో దర్యాప్తు అధికారిగా ఇన్‌స్పెక్టర్ ఎం. కొండల్‌రావు వ్యవహరించారు. ప్రస్తుత రాజాపేట ఎస్‌హెచ్‌ఓ ఎస్ఐ ఎం. తక్కియుద్దీన్, కోర్టు లైజన్ అధికారులు ఎం. శ్రీనివాస్, డి. కవిత, సీడీఓ జి. వీరారెడ్డి విచారణ ప్రక్రియలో సహకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు, పటిష్టమైన ఆధారాల సేకరణ, సమర్థవంతమైన ప్రాసిక్యూషన్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని పోలీసు అధికారులకు సూచించారు. ఈ కేసులో సమన్వయంతో పనిచేసి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బంది, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను అభినందించారు. నేరస్తులకు చట్టప్రకారం శిక్షలు పడేలా చర్యలు తీసుకోవడం ద్వారా ప్రజల్లో చట్టంపై నమ్మకాన్ని మరింత బలోపేతం జిల్లా పోలీసు శాఖ లక్ష్యమని ఎస్పీ పేర్కొన్నారు.



## పోగొట్టుకున్న చేనేత వస్త్రాల బ్యాగు అప్పగింత

- రూ.50 వేల విలువైన చీరలను యజమానికి అందజేత
- బ్యాగును తిరిగి అందించిన వారిని అభినందించిన బాధితుడు

**తొలివెలుగు, రామన్నపేట :** రామన్నపేట మండలంలోని జనంపల్లి రోడ్డులో పోగొట్టుకున్న చేనేత వస్త్రాల బ్యాగును గుర్తించి యజమానికి అప్పగించారు. సంగిశెట్టి భాస్కర్‌కు చెందిన సుమారు రూ.50 వేల విలువైన చేనేత చీరల బ్యాగును గుర్తించిన స్థానికులు, రామన్నపేట ఒకటో వార్డు సభ్యుడు జాడ సంతోష్, పోషబోయిన మల్లేశం సమక్షంలో సంబంధిత చేనేత వృత్తిదారుడికి అందజేశారు. విలువైన చేనేత వస్త్రాల బ్యాగును తిరిగి తనకు అందజేయడంతో యజమాని సంతోషం వ్యక్తం చేస్తూ సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

# జిల్లాలో 45 గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న రీ సర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

**జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ**

**భీమవరం,తొలివెలుగు,** జిల్లాలోని 45 గ్రామాల్లో వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్న రీ సర్వే పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం భీమవరం కలెక్టరేట్‌లోని ఆమె ఛాంబర్ నుంచి భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజనల్ అధికారులతో రీ సర్వే పురోగతిపై ఆమె వర్చువల్ గా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ల వారీగా పెండింగ్‌లో ఉన్న రీ సర్వే పనుల వివరాలను సమీక్షించి, పనుల పురోగతిపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మొత్తం 45 గ్రామాల్లో రీ సర్వే పనులు వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వీటిలో నరసాపురం డివిజన్‌లో 23 గ్రామాలు, భీమవరం డివిజన్‌లో 14 గ్రామాలు, తాడేపల్లిగూడెం డివిజన్‌లో 8 గ్రామాలు ఉన్నాయని వివరించారు. ఆయా గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న





పనులను ప్రాధాన్యత క్రమంలో వేగవంతం చేసి, రీ సర్వే ప్రక్రియతో పాటు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీకి సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను మార్చి 2027 నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నరసాపురం మండలంలో ఆరు గ్రామాలు, గణపవరం మండలంలో ఐదు గ్రామాల్లో రీ సర్వే పనులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొంటూ, సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రీ సర్వే పనుల నిర్వహణలో క్షేత్రస్థాయిలో సిబ్బందికి ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది కొరత ఉన్న ప్రాంతాల్లో ఆ వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి, పనులకు ఆటంకం కలగకుండా చూడాలన్నారు. రెవెన్యూ డివిజనల్ అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటించి, రీ సర్వే పనుల పురోగతిని సమీక్షించాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. పెండింగ్‌లో ఉన్న పనులను గుర్తించి, వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించుకోవాలని, నిర్దేశించిన గడువులోగా లక్ష్యాలను సాధించేలా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా సర్వే అధికారి జాషువా, కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ శేఖర్, సర్వే శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామానుజ నగర్‌లో వైభవంగా దాండియా వేడుకలు

- మహిళల సంప్రదాయ నృత్యాలు.. సాంస్కృతిక ప్రదర్శనలతో సందడి
- ముఖ్య అతిథిగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గుత్తా వెంకట్‌రెడ్డి



**తొలివెలుగు, అబ్దుల్లాపూర్‌మెట్ :** అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని మునగనూరు శ్రీరామానుజ నగర్ కాలనీలో దాండియా వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. కాలనీలోని బతుకమ్మ పార్కులో పలు కాలనీల మహిళల ఆధ్వర్యంలో నిర్వహించిన 'ది రిథమ్ నవరాత్రి' వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి దాండియా నృత్యాలు చేయడంతో ప్రాంగణమంతా సందడిగా మారింది. వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గుత్తా వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వేడుకల ఏర్పాట్లను పర్యవేక్షించిన కాలనీ అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు జలంధర్‌రెడ్డి, కాలనీ పెద్దలు గోనె మాధవరెడ్డి కృషిని అభినందించారు. కార్యక్రమ నిర్వాహకులు కే. సౌజన్య భారతి, ఆశాజ్యోతి, గోనెగండ్ల జయనాయుడు, కవితారెడ్డి పాల్గొన్నారు. వేడుకలను విజయవంతం చేసిన మునగనూరు గ్రామ ప్రజలు, మహిళలు, సహకరించిన పెద్దలకు నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# నార్ముల్‌లో రూ.8.97 కోట్ల ఆర్థిక అవకతవకలు!

- పాలకవర్గం, ఎండీలు సంయుక్తంగా బాధ్యత వహించాలి
- విచారణ నివేదికలో కీలక అంశాలు.. 30 రోజుల్లో జనరల్ బాడీ సమావేశానికి ఆదేశం

**తొలివెలుగు, రాజాపేట :** నల్గొండ, రంగారెడ్డి ఉమ్మడి జిల్లాల పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం (నార్ముల్)లో ఆర్థిక అవకతవకలు, నిధుల దుర్వినియోగానికి సంబంధించిన కీలక అంశాలు విచారణ నివేదికలో వెలుగులోకి వచ్చాయి. 2015-16 నుంచి 2023-24 వరకు జరిగిన ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి మొత్తం రూ.8,97,46,256లకు పాలకవర్గం, బోర్డు డైరెక్టర్లు, మేనేజింగ్ డైరెక్టర్లు సంయుక్తంగా, సమానంగా బాధ్యత వహించాల్సి ఉంటుందని విచారణ నివేదికలో పేర్కొన్నట్లు అధికారిక లేఖ వెల్లడించింది. ఈ వ్యవహారంపై తెలంగాణ సహకార శాఖ కమిషనర్, సహకార సంఘాల రిజిస్ట్రార్ 2026 సెప్టెంబర్ 10న ఆర్‌సీ నంబర్ 2551/2025-పీ.ఈ ద్వారా నార్ముల్ చైర్మన్, మేనేజింగ్ కమిటీ, బోర్డు ఆఫ్ డైరెక్టర్లు, మేనేజింగ్ డైరెక్టర్‌కు లేఖ జారీ చేశారు. తెలంగాణ రైతు లింగయ్య సమర్పించిన ఫిర్యాదు ఆధారంగా నార్ముల్ సంస్థ ఏర్పాటు, నిర్వహణ, ఆర్థిక పరిస్థితులు, ఇతర వ్యవహారాలపై విచారణ చేపట్టారు. ఈ మేరకు నియమితులైన విచారణ అధికారి అక్టోబర్ 1, 2026న నివేదిక సమర్పించారు. సంస్థ నిర్వహణలో అవకతవకలు జరిగినట్లు నివేదికలో పేర్కొన్నారని అధికారిక లేఖలో వివరించారు.

**30 రోజుల్లో జనరల్ బాడీ సమావేశం నిర్వహించాలి:**

తెలంగాణ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీస్ చట్టం, 1995లోని సెక్షన్లు 29(5)(ఏ), 31(ఏ) ప్రకారం విచారణ నివేదిక రెండు సంపుటాలను నార్ముల్ మేనేజింగ్ కమిటీకి పంపించారు. లేఖ అందిన తేదీ నుంచి 30 రోజుల్లోగా జనరల్ బాడీ సమావేశం నిర్వహించి, విచారణ నివేదికలోని అంశాలను సభ్యుల ముందుంచాలని ఆదేశించారు. నివేదికలో పేర్కొన్న అంశాలపై చర్చించి, తదుపరి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

**పాలకవర్గం తదుపరి చర్యలపై ఆసక్తి:**

ఈ వ్యవహారాన్ని అత్యవసరమైనదిగా పరిగణించాలని సహకార శాఖ కమిషనర్ స్పష్టం చేసినట్లు లేఖలో పేర్కొన్నారు. దాదాపు రూ.9 కోట్ల మేర ఆర్థిక వ్యవహారాలపై విచారణ నివేదిక వెలువడటంతో నార్ముల్ పాలకవర్గం తీసుకోబోయే తదుపరి చర్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. జనరల్ బాడీ సమావేశంలో నివేదికపై ఎలాంటి చర్చ జరుగుతుంది? బాధ్యులుగా పేర్కొన్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు? అనే అంశాలపై ఆసక్తి నెలకొంది.



## ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సిమెంట్ బస్తాల సాయం

- అందించిన ప్రముఖ పారిశ్రామికవేత్త తొర్ర విష్ణు

**తొలివెలుగు, ఆత్మకూర్ (ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ (ఎం) మండల కేంద్రంలోని ఇందిరా నగర్ కాలనీకి చెందిన గట్టు అజయ్ ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో అతడి కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న ప్రముఖ పారిశ్రామికవేత్త, సరస్వతి విద్యాలయం కరస్పాండెంట్ తొర్ర విష్ణు మానవతా దృక్పథంతో స్పందించి ఇంటి నిర్మాణానికి 15 బస్తాల సిమెంట్‌ను ఉచితంగా అందజేశారు. స్థానిక వార్డు సభ్యులు రాగటి మత్స్యగిరి, కూరెళ్ల అనిల్ ఆధ్వర్యంలో గురువారం ఈ సహాయాన్ని లబ్ధిదారుడికి అందించారు. తమ కుటుంబానికి అండగా నిలిచి సిమెంట్ సాయం అందించిన తొర్ర విష్ణుకు లబ్ధిదారుడు అజయ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సరస్వతి విద్యాలయం ప్రిన్సిపాల్ పంజాల నర్సయ్య గౌడ్, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## మహిళా సమభావన సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సహకారంతో పనుల ప్రారంభం

**తొలివెలుగు, ఆత్మకూర్ (ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ (ఎం) మండలం ఉప్పలపహాడ్ గ్రామంలో మహిళా సమభావన సంఘం భవన నిర్మాణ పనులు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ప్రత్యేక సహాయ సహకారాలతో ఈ భవన నిర్మాణాన్ని చేపట్టారు. గ్రామ సర్పంచ్ చిన్నం బీరప్ప ఆధ్వర్యంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు భవన నిర్మాణానికి సాంప్రదాయబద్ధంగా భూమిపూజ నిర్వహించి, ముగ్గు పోశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. మహిళల సాధికారత, సంఘ సమావేశాల నిర్వహణకు ఈ భవనం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ మల్లేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ బగ్గు, సంఘ బంధం అధ్యక్షురాలు తీగల స్వప్న, వార్డు సభ్యుడు చిన్నం శ్రీనివాస్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఆకుల బిక్షపతి, మాజీ సర్పంచులు లగ్గాని బాలరాజు, కొడిమల గోపాల్, కొడిమల సత్యనారాయణ, వీఓఏలు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



## అబ్దుల్ కలాం ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలి

- దేశాభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం
- కలాం జయంతి సందర్భంగా బీజేపీ నాయకుల నివాళులు

తొలివెలుగు, ఎల్బీనగర్: భారతరత్న, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకొని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశాభివృద్ధికి, శాస్త్ర సాంకేతిక రంగాల పురోగతికి అబ్దుల్ కలాం చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. యువతలో దేశభక్తి, క్రమశిక్షణ, పట్టుదలతో పాటు శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించేందుకు ఆయన చేసిన కృషి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. సాధారణ కుటుంబంలో జన్మించి తన ప్రతిభ, కృషి, పట్టుదలతో దేశ అత్యున్నత పదవిని అధిరోహించిన కలాం జీవితం యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన చూపిన మార్గంలో పయనిస్తూ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, దేశ ప్రగతికి తమ వంతు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, జీఎస్ఐ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర వినోద్ రెడ్డి, యాదగిరి గౌడ్, ప్రధాన కార్యదర్శి గోపాల్ శర్మ, ఉపాధ్యక్షుడు దినేష్ రెడ్డి, గిరి తదితరులు పాల్గొన్నారు.





## పంటను కాపాడుకునేందుకు 'డైనమో' దారి!

- కరెంటు కష్టాలపై రైతు వినూత్న ప్రయోగం
- ట్రాక్టర్‌కు డైనమో అమర్చి సాగునీటి పంపిణీ

**తొలివెలుగు, రాజాపేట :** వర్షాభావం, విద్యుత్ కోతలతో పొట్టదశలో ఉన్న వరి పంట ఎండిపోకుండా కాపాడుకునేందుకు ఓ రైతు చేసిన వినూత్న ప్రయత్నం స్థానికంగా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం పాముకుంట ఆవాస గ్రామమైన కాశగూడేనికి చెందిన రైతు ఎస్కే కరీం తనకున్న బోరు బావిపై ఆధారపడి మూడు ఎకరాల్లో వరి సాగు చేశాడు. పంట కోసం ఇప్పటివరకు దాదాపు రూ.80 వేల వరకు పెట్టుబడి పెట్టాడు. ప్రస్తుతం వరి పైరు పొట్టదశకు రాగా, వర్షాలు లేకపోవడం, మరోవైపు తరచూ విద్యుత్ కోతలు విధించడంతో పంట ఎండిపోయే పరిస్థితి నెలకొంది. బయట నుంచి జనరేటర్‌ను అద్దెకు తెస్తే గంటకు రూ.వెయ్యి చొప్పున ఖర్చవుతుండటంతో రైతు కరీం ఆలోచనలో పడ్డాడు. దీంతో ప్రత్యామ్నాయంగా రూ.80 వేల వ్యయంతో సెకండ్ హ్యాండ్ డైనమోను కొనుగోలు చేసి, తన ట్రాక్టర్‌కు అనుసంధానించాడు. విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సమయంలో ట్రాక్టర్ ఇంజిన్ సహాయంతో డైనమోను నడిపిస్తూ బోరు నుంచి నీటిని తోడి పంటను కాపాడుకుంటున్నాడు. విద్యుత్ కష్టాలు రైతులను ఏ స్థాయి ప్రత్యామ్నాయాల వైపు నడిపిస్తున్నాయో కరీం ప్రయత్నం నిదర్శనంగా నిలుస్తోంది.

## విద్యుత్తు వృథా.. చీకట్లకు దారితీస్తుంది!

- సామాజిక మాధ్యమాల ద్వారా విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రచారం
- 'పొదుపు చేస్తే.. ఉత్పత్తి చేసినట్లే' : విద్యుత్ ఏఈ చంద్రశేఖర్

**తొలివెలుగు, రాజాపేట:** భవిష్యత్తులో ఎదురయ్యే విద్యుత్ కొరతను అధిగమించేందుకు విద్యుత్ పొదుపుపై ప్రజల్లో అవగాహన కల్పించాలని రాజాపేట విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక ప్రచారం చేపట్టారు. సామాజిక మాధ్యమాల వేదికగా వినియోగదారులకు విద్యుత్ పొదుపు ఆవశ్యకతను వివరిస్తూ విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఏఈ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. విద్యుత్‌ను పొదుపు చేయడం అంటే కొత్తగా ఉత్పత్తి చేసినట్లేనని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరిగి వేసవిలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో వినియోగదారులు ఇప్పటి నుంచే విద్యుత్ పొదుపును అలవాటు చేసుకోవాలని సూచించారు.

**చిన్న మార్పులతో.. పెద్ద ప్రయోజనం:**

ఇళ్లతో పాటు వ్యాపార సంస్థలు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, కర్మాగారాల్లో విద్యుత్ వృథాను అరికట్టాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. అవసరం లేనప్పుడు విద్యుత్ దీపాలు, పరికరాలను ఆపివేయడం, విద్యుత్ ఆదా చేసే పరికరాలను వినియోగించడం వంటి చిన్నచిన్న చర్యలతో గణనీయమైన ప్రయోజనం పొందవచ్చని తెలిపారు. విద్యుత్ పొదుపు వల్ల బిల్లుల భారం తగ్గడమే కాకుండా, సమాజానికి కూడా మేలు జరుగుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో విద్యుత్ కొరత సమస్యలు తలెత్తకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఏఈ చంద్రశేఖర్ కోరారు.

## రాష్ట్ర కార్యదర్శి నంబూరు తేజ భరత్ కు సమస్యలపై వినతి

ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల సమస్యలు పై వినతి పత్రం అందజేశామని ఆంధ్ర ప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందికొండ జయరాజు అన్నారు. గురువారం పెదవేగి అంబేద్కర్ గురుకులం లో ఆయన మాట్లాడుతూ గురువారం అమరావతిలో ఆంధ్ర ప్రదేశ్ పాఠశాలల సెక్రటరీగా బాధ్యతలు ను నంబూరి తేజ్ భరత్ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో కలిసి వినతిపత్రం సమస్యలు వివరించటం జరిగిందన్నారు.

## జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక నామినేషన్ కేంద్రాలు: వైసీపీ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్ చేసిన హైకోర్టు

స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్ల ప్రక్రియ స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేలా ఆదేశించాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దాఖలు చేసిన పిటిషన్‌పై ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో వాదనలు ముగిశాయి. ప్రతి జిల్లా కేంద్రంలో ఎన్నికల అధికారి పర్యవేక్షణలో ప్రత్యేక నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతూ వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. బుధవారం ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ కిరణ్మయి తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది వీరా రెడ్డి వాదనలు వినిపిస్తూ.. సాధారణ నామినేషన్ కేంద్రాలు సరిపోవని, అభ్యర్థుల భద్రత దృష్ట్యా ప్రతి జిల్లా కేంద్రంలో అదనపు కేంద్రాలు అవసరమని కోర్టుకు విన్నవించారు. ఈ అంశంపై ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘానికి వినతిపత్రం సమర్పించినా ఎలాంటి స్పందన రాలేదని ఆయన ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ దమ్మాల శ్రీనివాస్, ఎన్నికల సంఘం తరఫున న్యాయవాది అశ్విని కుమార్ వాదనలు వినిపించారు. నామినేషన్ల దాఖలుకు మూడు రోజుల సమయం ఉంటుందని, ఎవరైనా అడ్డుకుంటే ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసే వెసులుబాటు ఉందని తెలిపారు. కేవలం అనుమానాల ప్రాతిపదికన న్యాయస్థానం ఆదేశాలు జారీ చేయలేదని వారు స్పష్టం చేశారు. జిల్లా కేంద్రాల్లో నామినేషన్ కేంద్రాల ఏర్పాటు అనేది ఎన్నికల అధికారి విచక్షణకు లోబడి ఉంటుందని, ప్రస్తుత నిబంధనల్లో దానికి అవకాశం లేదని వివరించారు. ఇప్పటికే నామినేషన్, పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని పోలీసు ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు కోర్టుకు నివేదించారు. ఇదే సమయంలో, స్థానిక ఎన్నికల్లో కేంద్ర బలగాలను మోహరించాలని, కుల ధ్రువీకరణ, నిరభ్యంతర పత్రాలను సకాలంలో జారీ చేయాలని కోరుతూ వైసీపీ దాఖలు చేసిన మరో రెండు పిటిషన్లపై విచారణను జస్టిస్ వి. సుజాత గురువారానికి వాయిదా వేశారు.

## ప్రధాన ఎన్నికల కమిషనర్ ఏకపక్ష వైఖరి సరికాదు

- కేంద్ర ప్రభుత్వం తీరుపై సమాజ్‌వాదీ పార్టీ ధ్వజం
- ఇండియా కూటమితో కలిసి పనిచేస్తాం: సమాజ్‌వాదీ పార్టీ
- రాజాపేట మండల సమావేశంలో తీర్మానం
- సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామాకు డిమాండ్



**తొలివెలుగు, రాజాపేట :** కేంద్రంలోని అధికార బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ బద్ధమైన ఎన్నికల కమిషన్ స్వయం ప్రతిపత్తిని దెబ్బతీస్తోందని సమాజ్‌వాదీ పార్టీ నేతలు ఆరోపించారు. యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన పార్టీ సమావేశంలో బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ఐక్యత, రాజ్యాంగ బద్ధమైన హక్కుల పరిరక్షణపై చర్చించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ సింహాద్రి యాదవ్, అధికార ప్రతినిధి శ్రీనివాస్ మాట్లాడుతూ.. సీఈసీ నియామక ప్రక్రియ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తొలగించి, ఏకపక్షంగా సీఈసీని నియమించుకున్నారని ఆరోపించారు. అలా నియమితులైన ప్రథమ ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ కేంద్ర ప్రభుత్వ ఒత్తిళ్లకు తలొగ్గి విధులు నిర్వహిస్తున్నారని, ఇది ప్రజాస్వామ్యానికి తీవ్ర విఘాతమని మండిపడ్డారు. 2024 తదనంతరం దేశంలో దాదాపు 13.5 కోట్ల మంది ఓట్లను తొలగించడం, ప్రతిపక్షాలపై కుట్రలు చేయడం వెనుక ఎన్నికల సంఘం ఏకపక్ష నిర్ణయాలే కారణమన్నారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బిసి, మహిళా వర్గాలకు జనాభా ప్రాతిపదికన సామాజిక న్యాయం జరగాలంటే సమాజ్‌వాదీ పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీరాముల ఇలియాస్, సుదర్శన్, కొమ్ము సత్యం, ఉచింతల బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎండుతున్న పైరు.. కనుపాపల్లో కన్నీరు

- రాజాపేట మండలంలో విలవిలలాడుతున్న వరి చేన్లు
- పొట్ట దశలోనే నీళ్లు లేక నిలువునా ఎండిపోతున్న వరి
- మాటిమాటికీ విద్యుత్ కోతలు.. నీటిని తోడలేకపోతున్న బోర్లు
- మా ప్రాణాలు కాపాడండి మహాప్రభో అంటున్న పాముకుంట, సింగారం రైతులు



**తొలివెలుగు, రాజాపేట :** వర్షాభావ పరిస్థితులు ఒకవైపు రైతాంగాన్ని తీవ్రంగా వెంటాడుతుంటే.. మరోవైపు నాణ్యత లేని విద్యుత్ సరఫరా, తరచూ కోతలు, లో-వోల్టేజీ సమస్యలు కర్షకులను కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. ఆరుగాలం కష్టపడి, ఎంతో ఆశతో లక్షలాది రూపాయలు అప్పులు చేసి సాగు చేసిన వరి పంటలు కళ్లముందే నీరందక ఎండిపోతుంటే రైతుల ఆవేదన వర్ణనాతీతంగా మారింది. యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాలైన పాముకుంట, సింగారం, జాల, కుర్రారం, బొందుగుల తదితర ప్రాంతాల్లో ఎకరాకు ఎకరం వరి పంటలు ఎండిపోతున్నాయి. ప్రస్తుతం పంటలన్నీ పొట్ట దశలో ఉండటంతో నీటి అవసరం అత్యంత కీలకంగా మారింది. ఈ సమయంలోనే సరిపడా సాగునీరు అందకపోవడంతో పైర్లు పొలాల్లోనే నిలబడి ఎండిపోతున్నాయి.

**అడుగంటిన భూగర్భ జలాలు.. పనిచేయని మోటార్లు:**

ఈ ఏడాది వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో చెరువులు, కుంటలు, బావుల్లో నీటి నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయి. భూగర్భ జలాలు సైతం అడుగంటడంతో రైతులు పూర్తిగా బోరు బావులపైనే ఆధారపడి పంటలను కాపాడుకునేందుకు తాపత్రయపడుతున్నారు. అయితే విద్యుత్ శాఖ సరఫరా చేస్తున్న అరకొర విద్యుత్, అందులోనూ విపరీతమైన లో-వోల్టేజీ కారణంగా మోటార్లు సక్రమంగా నడవడం లేదు. వచ్చిన కాసేపే విద్యుత్ ఉండటం, ఉన్న సమయంలోనూ వోల్టేజీ లేక నీరు పైకి రాకపోవడంతో పొలాలకు తడి అందడం లేదు.

**అప్పుల ఊబిలో రైతాంగం:**

విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, దుక్కులు మరియు కూలీల కోసం ఎకరానికి వేలాది రూపాయల చొప్పున పెట్టుబడి పెట్టారు. పంట చేతికొచ్చే సమయంలో నీరందక ఎండిపోతే తీర్చలేని అప్పుల ఊబిలో కూరుకుపోతామని రైతులు కన్నీటిపర్యంతమవుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు, వ్యవసాయ అధికారులు స్పందించి లో-వోల్టేజీ సమస్యను పరిష్కరించి, తగినంత ఉచిత విద్యుత్‌ను నిరంతరాయంగా అందించాలని రాజాపేట ప్రాంత రైతులు కోరుతున్నారు.





## సమగ్ర పోషక యాజమాన్యంతోనే భూసార పరిరక్షణ, నాణ్యమైన దిగుబడులు

ఏరువాక కేంద్రం, ఏలూరులో పీఏసీఎస్ సభ్యులకు శిక్షణ




**తొలివెలుగు,ఏలూరు:** ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఏరువాక కేంద్రం, ఏలూరులో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్) సభ్యులకు నిర్వహించిన 15 రోజుల సమగ్ర పోషక యాజమాన్య ధ్రువీకరణ పత్ర కోర్సు (జజ×చీవీ) ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. అక్టోబర్ 1 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమానికి పీూచీూ+జు, హైదరాబాద్, ూూవీజు×, గుంటూరు సంస్థలు సహకారం అందించాయి. ఏరువాక కేంద్రం సమన్వయకర్త డా. కె. ఫణికుమార్, వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త డా. ఎన్. నాగేంద్రబాబు కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డా. కె. ఫణికుమార్ మాట్లాడుతూ వ్యవసాయ పంటల్లో సేంద్రియ, జీవ, రసాయన ఎరువులను పంట అవసరాలకు అనుగుణంగా సమతుల్యంగా వినియోగించాలని సూచించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం (ఆర్ఏఆర్ఎస్), మార్టేరు అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డా. సి. హెచ్. శ్రీనివాస్ మాట్లాడుతూ నేల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని, నేల పరీక్షల ఆధారంగా ఎరువులను వినియోగించడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించి ఉత్పాదకతను పెంచుకోవచ్చని వివరించారు. అతిథిగా పాల్గొన్న ఏలూరు జిల్లా వ్యవసాయ అధికారి శ్రీ షేక్ హబీబ్ బాషా ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యతను వివరిస్తూ, స్థానిక వనరుల వినియోగం, నేల ఆరోగ్య పరిరక్షణ, పర్యావరణహిత సాగు పద్ధతుల ద్వారా స్థిరమైన వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని సూచించారు. ఏలూరు జిల్లా ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ రామ్మోహన్ మాట్లాడుతూ ఉద్యాన పంటల్లో బిందు, తుంపర సేద్య పద్ధతుల ద్వారా నీటిని సమర్థంగా వినియోగించుకోవచ్చని, నీటి వృథాను తగ్గిస్తూ పంటల ఉత్పాదకతను పెంచవచ్చని తెలిపారు. ఏలూరు జిల్లా ఉద్యానవన అధికారి సాజా నాయక్ మాట్లాడుతూ ఉద్యాన పంటల్లో సరైన సమయంలో, సరైన మోతాదులో పోషకాలను అందించడం ద్వారా పంటల పెరుగుదల, దిగుబడి, నాణ్యతను మెరుగుపరచవచ్చని వివరించారు. ఏరువాక కేంద్రం వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త డా. నాగేంద్రబాబు వ్యవసాయ పంటల్లో ద్రవ జీవ ఎరువుల ప్రాముఖ్యతను వివరిస్తూ, వాటి సరైన వినియోగం ద్వారా పోషకాల లభ్యతను మెరుగుపరచడంతో పాటు స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించవచ్చని తెలిపారు. శిక్షణ ముగింపులో పాల్గొన్న పీఏసీఎస్ సభ్యులకు తుది పరీక్ష, మౌఖిక పరీక్ష నిర్వహించడంతో పాటు శిక్షణపై వారి అభిప్రాయాలను సేకరించారు. అనంతరం డా. ఎన్. నాగేంద్రబాబు వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది. శిక్షణ కార్యక్రమ విజయవంతానికి సహకరించిన విశ్వవిద్యాలయ అధికారులు, ప్రాయోజక సంస్థలు, అతిథులు, వనరుల నిపుణులు, శిక్షణార్థులకు కృతజ్ఞతలు తెలిపారు.

TGTEL/26/A6221
తొలివెలుగు
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయపత్రిక
జనరల్
General
యాదాద్రి భువనగిరి శుక్రవారం 16 అక్టోబర్ 2026
www.tholivelugu.com



# మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై పూర్తి అవగాహనతో విధులు నిర్వహించాలి

**ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు సమన్వయంతో పనిచేయాలి: జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ**

**భీమవరం,తొలివెలుగు,**నరసాపురం మున్సిపల్ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్నికల విధులు కేటాయించిన అధికారులు, సిబ్బంది తమ బాధ్యతలపై పూర్తి అవగాహన కలిగి, సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల ప్రక్రియను ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ ఆదేశించారు. గురువారం భీమవరం కలెక్టరేట్లోని పి.జి.ఆర్.ఎస్. సమావేశ మందిరంలో నరసాపురం మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల అధికారులు, అదనపు ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, జోనల్ అధికారులు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి పర్యవేక్షణ బృందం, సంబంధిత సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి అధికారి, సిబ్బంది తమకు కేటాయించిన బాధ్యతలను పూర్తిస్థాయిలో అర్థం చేసుకొని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో ప్రతి దశ కీలకమైనదని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ నెల 16వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటించాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. నామినేషన్ల స్వీకరణకు సంబంధించి నిర్దేశించిన విధివిధానాలు, అభ్యర్థులు సమర్పించాల్సిన పత్రాలు, సంబంధిత రికార్డుల నిర్వహణపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ సమయంలో నిబంధనలకు అనుగుణంగా వ్యవహరిస్తూ, ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించాలని పేర్కొన్నారు. నామినేషన్ల స్వీకరణ విధులకు కేటాయించిన అధికారులు, సిబ్బంది ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తయిన అనంతరం ప్రతిరోజూ సంబంధిత రోజువారీ నివేదికలను ఉన్నతాధికారులకు సమర్పించాలని ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సంఘం జారీ చేసిన ప్రవర్తనా నియమావళిని అధికారులు క్షుణ్ణంగా అవగాహన చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. ఎన్నికల ప్రచార సమయంలో రాజకీయ పార్టీల అభ్యర్థులు పాటించాల్సిన నియమాలను పర్యవేక్షిస్తూ, ఎక్కడైనా నిబంధనల ఉల్లంఘనలు గుర్తించినప్పుడు సంబంధిత అధికారులకు వెంటనే సమాచారం అందించాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేస్తూ, వివిధ విభాగాల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. ఎన్నికల విధుల్లో ఎదురయ్యే సందేహాలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో ప్రతి అధికారి తనకు కేటాయించిన విధులపై స్పష్టత కలిగి ఉండటంతో పాటు, ఇతర విభాగాల అధికారులతో సమన్వయం చేసుకోవాలని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పాక్షికత, జవాబుదారీతనానికి ప్రాధాన్యతనిస్తూ ఎన్నికల సంఘం ఆదేశాలను తూచా తప్పకుండా పాటించాలని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి నరసాపురం మున్సిపల్ ఎన్నికల నిర్వహణ సజావుగా జరిగేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పి గ్లోరియా, కె ఆర్ సి డిప్యూటీ కలెక్టర్ పి ప్రభాకర్, అదనపు ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, జోనల్ అధికారులు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి పర్యవేక్షణ బృందం, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# రాజకీయ పార్టీల సహకారంతోనే ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ: జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం,తొలివెలుగు,**రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం జిల్లాలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలైన మున్సిపల్, పంచాయతీ ఎన్నికలు-2026లను అత్యంత పారదర్శకంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు పూర్తి స్థాయిలో సహకరించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. ఎన్నికల నోటిఫికేషన్లు వెలువడిన నేపథ్యంలో, జిల్లా ఎన్నికల పరిపాలనా విభాగం ఆధ్వర్యంలో కలెక్టరేట్లోని వశిష్ట సమావేశ మందిరంలో గురువారం జరిగిన "ఎన్నికల ప్రవర్తన నియమావళి మరియు ఎన్నికల ప్రక్రియ" పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, ఎన్నికల షెడ్యూల్ విడుదలైన క్షణం నుంచే జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చిందని స్పష్టం చేశారు. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ప్రచార సమయాల్లో, సభలు, ర్యాలీల నిర్వహణలో ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్తులపై రాతలు, ఫ్లెక్సీల ఏర్పాటు నిషిద్ధమని, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేలా నగదు, మద్యం పంపిణీ చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అభ్యర్థులందరూ ఎన్నికల సంఘం నిర్దేశించిన పరిమితికి లోబడే ఖర్చు చేయాలని, ఖర్చు వ్యయం నిబంధనలు మించకూడదని స్పష్టం చేశారు. పట్టణ స్థానిక సంస్థలు, జడ్పిటిసి, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీల ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం వేర్వేరు తేదీలను నిర్దేశించిందని కలెక్టర్ తెలిపారు.

- పట్టణ స్థానిక సంస్థల (మున్సిపల్) ఎన్నికల షెడ్యూల్: అక్టోబర్ 14న రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేయగా, అక్టోబర్ 16న రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నోటీసులు జారీ చేయనున్నారు. నామినేషన్ల స్వీకరణకు అక్టోబర్ 18 చివరి తేదీ. అక్టోబర్ 19న నామినేషన్ల పరిశీలన, అక్టోబర్ 21న నామినేషన్ల ఉపసంహరణ, తుది అభ్యర్థుల జాబితా ప్రకటన ఉంటాయి. అక్టోబర్ 28న పోలింగ్, అవసరమైన చోట అక్టోబర్ 29న రీపోలింగ్ నిర్వహిస్తారు. అక్టోబర్ 30న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటిస్తారు.
- ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్: అక్టోబర్ 19న రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్, అక్టోబర్ 21న రిటర్నింగ్ అధికారుల ఎన్నికల నోటీసులు వెలువడనున్నాయి. అక్టోబర్ 23 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. అక్టోబర్ 24న పరిశీలన, అక్టోబర్ 25న తిరస్కరించిన నామినేషన్లపై అప్పీళ్ల స్వీకరణ, అక్టోబర్ 26న అప్పీళ్ల పరిష్కారం ఉంటాయి. అక్టోబర్ 27న నామినేషన్ల ఉపసంహరణ, తుది అభ్యర్థుల జాబితా ప్రకటన జరుగుతాయి. నవంబర్ 3న పోలింగ్, అవసరమైతే నవంబర్ 4న రీపోలింగ్, నవంబర్ 5న ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన ఉంటాయి. ఎన్నికల కోడ్ అమలును పర్యవేక్షించేందుకు జిల్లా వ్యాప్తంగా ఫ్లయింగ్ స్క్వాడ్స్, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు నిరంతరం నిఘా ఉంచుతాయని తెలిపారు.

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు గరిష్ఠంగా నాలుగు సార్లు (4 సెట్లు) నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉందని, కాబట్టి అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేసేటప్పుడు అన్ని వివరాలను జాగ్రత్తగా చూసుకొని పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. నామినేషన్ వేసేందుకు వచ్చే అభ్యర్థుల వాహనాలను రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి 100 మీటర్ల దూరంలోనే నిలిపివేయాల్సి ఉంటుంది. ఆ పరిధి దాటి లోపలికి వాహనాలకు అనుమతి ఉండదని అన్నారు. రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించేందుకు వెళ్లే సమయంలో అభ్యర్థితో పాటు మరో ఇద్దరు వ్యక్తులకు మాత్రమే లోపలికి వెళ్లేందుకు అవకాశం కల్పిస్తామని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ కె ఆర్ కల్పశ్రీ మాట్లాడుతూ, ప్రచార సమయంలో ఒకే చోట రెండు వేర్వేరు పార్టీలు ప్రచారం చేయకుండా, వేర్వేరు ప్రాంతాలలో పోలీసు ముందస్తు అనుమతితో ప్రచారం నిర్వహించుకోవాలన్నారు. అప్పుడే ప్రశాంత వాతావరణంలో ప్రచారం కొనసాగుతుందని, లేదంటే అనవసర ఇబ్బందులు తలెత్తుతాయని పేర్కొన్నారు. ఏ ఒక్క ప్రభుత్వ అధికారి కూడా ఎన్నికల నియమాలను ఉల్లంఘించి ఏ ఒక్క పార్టీకి మద్దతుగా వ్యవహరించకూడదని, అంతా నిష్పక్షపాతంగా పనిచేయాలని ఆదేశించారు. ఎవరైనా అధికారి తమ పదవులను దుర్వినియోగం చేసినట్లు తేలితే వారిపై శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవని జేసీ హెచ్చరించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ పీ గ్లోరియా, జడ్పీ సీఈవో డి రమణ, జిల్లా పంచాయతీ అభివృద్ధి అధికారి వై దోసి రెడ్డి, ఎలక్షన్ సెక్షన్ ఇంచార్జ్ సూపరింటెండెంట్ హెచ్ ఎన్ సి శేఖర్, జిల్లా పంచాయతీ అధికారి పి విజయ భాస్కర్, వైఎస్సార్ సీపీ పార్టీ నుంచి డివిడి ప్రసాద్, టీడీపీ పార్టీ నుంచి యు చంద్రశేఖర్ , జనసేన పార్టీ నుంచి బి జై శివ, బీజేపీ పార్టీ నుంచి కె సురేంద్ర వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు మరియు ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

**భీమవరం:తొలివెలుగు,** గుర్తు తెలియని వాహన ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న విద్యార్థి మృతిచెందినట్లు భీమవరం టూటౌన్ సీఐ పి మురళీకృష్ణ చెప్పారు. ప్రకాశం జిల్లా నాగుఉప్పలపాడు గ్రామానికి చెందిన ఉదరగూడి రాకేష్(20) పట్టణంలోని ఎస్ఆరకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్నాడు. తన స్నేహితులతో కలసి వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ముగ్గురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో రాకేష్ గురువారం ఉదయం మృతిచెందినట్లు సీఐ మురళీకృష్ణ చెప్పారు.

## ముగిసిన ప్రత్యేక టెట్ పరీక్షలు

**భీమవరం:తొలివెలుగు,** జిల్లాలోని రెండు పరీక్షా కేంద్రాల్లో కేంద్రాల్లో నిర్వహించిన ప్రత్యేక టెట్ పరీక్షలు గురువారంతో ముగిసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఓవీఎస్ అనిల్‌కుమార్ చెప్పారు. గురువారం రెండు పరీక్షా కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా 16 మంది గైరహాజరయ్యారనిఉదయం పరీక్షకు 202 మంది అభ్యర్థులకుగాను 194 మంది హాజరుకాగా మధ్యాహ్నం పరీక్షకు 201 మందికి 8 మంది గైరహాజరయ్యారన్నారు.



## మహాలక్ష్మి దేవిగా బాలత్రిపుర సుందరి దేవి

**భీమవరం తొలివెలుగు,** దేవి శరన్నవరాత్రుల మహోత్సవంలో భాగంగా భీమవరం మెంటేవారి తోటలోని శ్రీబాల త్రిపుర సుందరి అమ్మవారిని గురువారం మహాలక్ష్మి దేవిగా అలంకరణ చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, లలిత సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. దాతల సహకారంతో అమ్మవారిని 108 గులాబీ దండలతో అలంకరణ చేశారు. ప్రత్యేకంగా ఆలయ ప్రాంగణంలో అమ్మవారిని రూ 100, 200, 500 కరెన్సీ నోట్లతో మహాలక్ష్మి దేవిగా అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులందరూ అమ్మవారిని దర్శించుకున్నారు. కమిటి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## వీఆర్ఎల సహాయ నిరాకరణ ఉద్యమం ఉద్యమం తాత్కాలిక విరమణ

తహసీల్దార్ జి సుందర్ సింగ్ కు వినతి పత్రం అందిస్తున్న విఆర్ఎ లు



**భీమవరం, తొలివెలుగు,** రాష్ట్రంలోని వీఆర్ఎల సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న ఉద్యమం తాత్కాలికంగా నిలిపివేనున్నట్లు వీఆర్ఏల సంఘం నాయకులు గురువారం తెలిపారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ జి సుందర్ సింగ్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్టోబర్ 14 తేదీనుండి స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ వచ్చినందున సహాయ నిరాకరణ ఉద్యమ కార్యచరణను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వం వీఆర్ఎల న్యాయమైన సమస్యలు పరిష్కరించకపోతే స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలియజేసారు.

## గజలక్ష్మి అమ్మవారి అలంకరణలో....



**కాళ్ళ కురు,తొలివెలుగు,**కాళ్ళ కురు గ్రామంలో వేంచేసి యున్న స్వయంభూః శ్రీ వేంకటేశ్వరస్వామివారి దేవస్థానం శ్రీలక్ష్మీ శరన్నవరాత్రి మహోత్సవముల్లో భాగంగా గురువారం 5వ.రోజు అమ్మవారు శ్రీ గజలక్ష్మి గా భక్తులకు దర్శనం ఇచ్చురు. శ్రీ యతిరాజుల ఆండాళ్ గోష్టి కాళ్లకూరు వారిచే అమ్మవారికి సహస్రనామ కుంకుమ పూజ, సాయంత్రం అష్టోత్తర శత నామార్చన,నీరాజన మంత్రపుష్పము, అమ్మవారి ఆలయ ప్రదక్షిణము ఘనంగా జరిపారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదములు స్వీకరించినారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కరగకుండా దేవస్థానం కార్యనిర్వహణాధికారి, చైర్మన్, పాలకమండలి సభ్యులు తగు ఏర్పాట్లు చేశారు.

## వైద్య విద్యార్థుల అభ్యాసనకు వరలక్ష్మి మృతదేహం



**భీమవరం:తొలివెలుగు,**మరణానంతరం తన దేహాన్ని వైద్య విద్యార్థుల అభ్యాసనకు దానం చేయాలనే ఆమె కోరికను కుటుంబసభ్యులు నెరవేర్చారు. భీమవరం పట్టణం గునుపూడి ప్రాంతానికి చెందిన రావి వరలక్ష్మి(91) మృతిచెందడంతో ఆమె కుమార్తె కొల్లా సాయి సుజాత ఏలూరు ఆశ్రమం హాస్పిటల్‌కు వరలక్ష్మి మృతదేహాన్ని అందచేశారు. అవయవదానం వల్ల మరొక నలుగురు వ్యక్తులను ఉపయోపడవచ్చుననే ప్రచామాధ్యమాల ద్వారా తెలుసుకున్న సాయి సుజాత తన మరణాంతరం తమ దేహాన్ని వైద్యవిద్యార్థుల అభ్యాసనకు ఇవ్వాలనే నిర్ణయానికి వచ్చారు. ఆమె స్ఫూర్తిగా తీసుకుని సుజాత తల్లి వరలక్ష్మి కూడా తన మృతదేహాన్ని దానం చేస్తానని చెప్పడంతో ఆ మేరకు అంగీకారపత్రం రాయించారు. ఈనెల 13వ తేదిన వరలక్ష్మి మృతి చెందడంతో ఆ విషయాన్ని ఏలూరు ఆశ్రమం ఆసుపత్రి వైద్యులకు తెలియచేసి మృతదేహాన్ని అప్పగించినట్లు సుజాత తెలిపారు. ఈ కార్యక్రమంలో సుజాత కుమార్తె ఉలా సాయి సౌజన్య పాల్గొన్నారు.



# మెరిసిన బ్యాంకింగ్, ఐటీ షేర్లు

**సెన్సెక్స్ 1,534, నిఫ్టీ 375 పాయింట్లు వృద్ధి**

ముంబై, అక్టోబర్ 15: దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం భారీ లాభాల్లో ముగిశాయి. బ్యాంకులు, ఐటీ రంగ షేర్లతోపాటు బ్లూచిప్ కంపెనీ రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లకు మదుపర్ల నుంచి పెద్ద ఎత్తున కొనుగోలు మద్దతు లభించింది. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 1,533.72 పాయింట్లు లేదా 2.11 శాతం పుంజుకుని 74,315.61 వద్ద ముగిసింది. ఒకానొక దశలో 1,548.40 పాయింట్లు ఎగబాకింది. ఇక నిఫ్టీ కూడా 374.65 పాయింట్లు లేదా 1.66 శాతం ఎగిసి 22,997.35 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్‌లో పరుగులు పెడుతున్న ముడి చమురు ధరలకు బ్రేకులు పడటం.. మార్కెట్ సెంటిమెంట్‌ను బలపర్చింది. బ్యారెల్ బ్రెంట్ క్రూడాయిల్ రేటు 2.34 శాతం పడిపోయి 103.60 డాలర్లకు దిగొచ్చింది. అలాగే ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ గతకొద్ది రోజులుగా పెరుగుతుండటం కూడా కలిసొచ్చింది. ఇక కృత్రిమ మేధస్సు విలువలు అతిగా పెరుగుతున్న నేపథ్యంలో సెంట్రల్ బ్యాంకులు, రెగ్యులేటర్లు, మార్కెట్ భాగస్వాములు దిద్దుబాటుకు అవకాశాలున్నాయని హెచ్చరించడం.. భారతీయ ఈక్విటీల్లోకి విదేశీ పెట్టుబడుల ప్రవాహానికి దోహదం చేసినట్టు తాజా సరళిని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. అంతేగాక అమెరికాలో అధిక ద్రవ్యోల్బణం, కఠిన ద్రవ్య విధానం, బాండ్ల రాబడుల్లో క్షీణత కూడా ఇన్వెస్టర్లను స్టాక్స్ వైపునకు మొగ్గు చూపేలా చేశాయని వారు అంటున్నారు.

# మహీంద్రా ఎక్స్‌యూవీ 3ఎక్స్‌వో మాడల్

**ప్రారంభ ధర రూ.9.99 లక్షలు**




ముంబై, అక్టోబర్ 15 : ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా సరికొత్త మాడల్‌ను పరిచయం చేసింది. ఎక్స్‌యూవీ 3ఎక్స్‌వో జెడ్ఎన్‌జీ పేరుతో విడుదల చేసిన ఈ మాడల్ రూ.9.99 లక్షల నుంచి రూ.12.27 లక్షల మధ్యలో ధరను నిర్ణయించింది. సీఎన్‌జీ, పెట్రోల్ ఇంజిన్‌తో తయారు చేసింది. కేవలం 4.9 సెకండ్లలో 60 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు అడ్వాన్స్‌డ్ సీఎన్‌జీ టెక్నాలజీ కలిగిన ఈ మాడల్ కిలోకు 24.7 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నది. భద్రతా ప్రమాణాలు పాటించడంలో భాగంగా ఫైవ్ స్టార్ రేటింగ్, 35 స్టాండర్డ్ ఫీచర్లు ఉన్నాయి. వీటిలో 26 సెంటీమీటర్ల హెచ్‌డీ ఇన్ఫోటైన్‌మెంట్ స్క్రీన్, వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో కార్‌ప్లే, రియర్ వ్యూ కెమెరా, క్రూజ్ కంట్రోల్, టైప్ సీ చార్జర్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, ఎలక్ట్రానిక్ స్టేబిలిటీ కంట్రోల్, టైర్ ప్రెషర్ మానిటరింగ్ సిస్టమ్ వంటి ఫీచర్లతో తీర్చిదిద్దింది.

# చక్కెర నిల్వలపై కేంద్రం కొత్త నిబంధనలు.. నేటి నుంచే అమలు..

రాబోయే పండుగల సీజన్‌లో చక్కెర కృత్రిమ కొరతను నివారించి, వినియోగదారులకు అందుబాటు ధరల్లో చక్కెర లభించేలా చూసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వినియోగదారుల వ్యవహారాలు, ఆహార పంపిణీ మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఈ కొత్త నిబంధనలు అక్టోబర్ 15 నుంచి అమల్లోకి వచ్చి నవంబర్ 30 వరకు కొనసాగనున్నాయి. ఈ కొత్త ఉత్తర్వుల ప్రకారం.. చక్కెర వ్యాపారులు, డీలర్లు గరిష్ఠంగా 1,000 క్వింటాళ్ల నిల్వలను మాత్రమే కలిగి ఉండాలి. అలాగే తాము కొనుగోలు చేసిన సరుకును 15 రోజుల వ్యవధిలోనే మార్కెట్‌లో విక్రయించాల్సి ఉంటుంది. అంతకుముందు ఆగస్టులో ఈ పరిమితి 4,000 క్వింటాళ్లు (30 రోజులు) కాగా, సెప్టెంబర్‌లో 2,000 క్వింటాళ్లకు తగ్గించారు. ఇప్పుడు దీనిని మరింత కఠినతరం చేస్తూ 1,000 క్వింటాళ్లకు కుదించారు. అయితే, భౌగోళిక రవాణా ఇబ్బందులు, సుదూర ప్రాంతాల సరఫరా అవసరాలను దృష్టిలో ఉంచుకుని కోల్‌కతా, దాని పరిసర మెట్రో ప్రాంతాలతో పాటు అసోం రవాణా మార్గాలకు ఈ నిబంధనల్లో ప్రత్యేక మినహాయింపునిచ్చారు. అక్కడ వ్యాపారులు గరిష్ఠంగా 2,000 క్వింటాళ్ల వరకు సరుకును నిల్వ చేసుకునేందుకు కేంద్రం అనుమతించింది. వ్యాపారులు భారీగా చక్కెరను నిల్వ చేసి సరుకు కొరత సృష్టించకుండా నిరోధించడం, మిల్లుల నుంచి మార్కెట్‌కు చక్కెర సరఫరా వేగవంతం చేయడం ఈ చర్య ప్రధాన ఉద్దేశం. దసరా, దీపావళి పండుగల వేళ తీపి పదార్థాల తయారీకి చక్కెర వినియోగం విపరీతంగా పెరుగుతుంది. ఇటీవల ఎక్స్-మిల్ ధరలు తోడు రిటైల్ మార్కెట్‌లో ధరలు క్రమంగా తగ్గుముఖం పడుతున్న తరుణంలో, వ్యాపారులు ఈ ప్రయోజనాన్ని నేరుగా వినియోగదారులకు అందించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.



# ఉద్యోగులకు గుడ్‌న్యూస్.. భారీగా పెరగనున్న జీతాలు!.. ఏ రంగంలో ఎక్కువంటే?




జీతాలు పెరగక చాలా రంగాల్లో ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.. మరికొన్ని రంగాలను ఉద్యోగాల తొలగింపు భయం వెంటాడుతుంది.. ఇక, మరికొన్ని రంగాల్లో ఉద్యోగాలకు దెబ్బకొడుతుంది.. అయితే, ఉద్యోగులకు గుడ్ న్యూస్.. భారత్‌లో 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఉద్యోగుల జీతాలు సగటున 9.1 శాతం పెరిగే అవకాశం ఉందని గ్లోబల్ ప్రొఫెషనల్ సర్వీసెస్ సంస్థ ఏఆన్ (ఆఈజ) తన వార్షిక సర్వేలో వెల్లడించింది. నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు (ఎన్‌బీఎఫ్‌సీ), ఇంధన రంగం, రియల్ ఎస్టేట్, మౌలిక సదుపాయాల రంగాల్లో పనిచేసే ఉద్యోగులకు అధిక వేతన పెంపు లభించే అవకాశం ఉందని అంచనా వేసింది. 45 పరిశ్రమలకు చెందిన 1,200కు పైగా కంపెనీల సమాచారాన్ని విశ్లేషించి ఈ నివేదికను రూపొందించింది.

**ఎన్‌బీఎఫ్‌సీ రంగంలో అత్యధిక జీతాల పెంపు**

2026-27లో ఎన్‌బీఎఫ్‌సీ రంగంలో ఉద్యోగుల జీతాలు 10.1 శాతం పెరిగే అవకాశం ఉందని సర్వే అంచనా వేసింది. ఈ జాబితాలో ఇంధన రంగం 9.9 శాతం పెంపుతో రెండో స్థానంలో ఉండగా, రియల్ ఎస్టేట్, మౌలిక సదుపాయాల రంగాల్లో 9.8 శాతం వేతన పెంపు ఉండొచ్చని తెలిపింది. ప్రతిభావంతులైన ఉద్యోగులను ఆకర్షించడం, కొనసాగించడం కోసం కంపెనీలు పెట్టుబడులు పెడుతూనే ఖర్చులను నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్నాయని నివేదిక సూచించింది.ఛభారత్‌లో దేశీయ వినియోగం బలంగా ఉండటం, పెట్టుబడులు కొనసాగడం, ఎగుమతులు మెరుగుపడటం వంటి అంశాలు కంపెనీల వ్యాపార విశ్వాసాన్ని పెంచుతున్నాయని ఏఆన్ ఇండియా టాలెంట్ సొల్యూషన్స్ విభాగం అధిపతి, భాగస్వామి రూపాంక్ చౌదరి తెలిపారు. ఈ పరిస్థితులు ఉద్యోగుల్లో ప్రతిభను పెంపొందించేందుకు కంపెనీలకు తోడ్పడుతున్నాయని, అదే సమయంలో నిర్వహణ ఖర్చులను అదుపులో ఉంచేందుకు అవకాశం కల్పిస్తున్నాయని పేర్కొన్నారు.

**ఉద్యోగుల వలసలు 18 శాతానికి పెరుగుదల**

జీతాల పెంపు అంచనాలు స్థిరంగా ఉన్నప్పటికీ, నైపుణ్యం కలిగిన ఉద్యోగులను సంస్థల్లో కొనసాగించడం కంపెనీలకు సవాలుగా మారుతోంది. 2026లో ఉద్యోగుల వలసల రేటు 18 శాతానికి పెరిగినట్లు ఏఆన్ సర్వే వెల్లడించింది. 2025లో ఇది 16.2 శాతంగా, 2024లో 17.1 శాతంగా నమోదైంది. ఈ గణాంకాలు ప్రతిభావంతులైన ఉద్యోగుల కోసం కంపెనీల మధ్య పోటీ కొనసాగుతోందని సూచిస్తున్నాయి.

**కంపెనీల్లో పెరుగుతున్న ఏఐ వినియోగం**

కార్పొరేట్ రంగంలో కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగం వేగంగా పెరుగుతోందని సర్వే తెలిపింది. ఏఐ ఆధారిత ఉత్పాదకత సాధనాలను క్రమం తప్పకుండా ఉపయోగిస్తున్న కంపెనీల శాతం 2025లో 46.1 శాతంగా ఉండగా, 2026లో 56 శాతానికి చేరింది. దాదాపు 60 శాతం కంపెనీలు ఉద్యోగులకు కొత్త నైపుణ్యాలు నేర్పడంపై దృష్టి సారిస్తున్నాయి. ఏజెంటిక్ ఏఐ వినియోగం, ఏఐ సంబంధిత నైపుణ్యాలకు డిమాండ్ కూడా పెరుగుతున్నట్లు నివేదిక పేర్కొంది. ఏఐ, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్‌లో నైపుణ్యం ఉన్న ఉద్యోగులకు భారతీయ కంపెనీలు 2025తో పోలిస్తే సుమారు 10 శాతం అధిక వేతనాలు చెల్లిస్తున్నట్లు సర్వే వెల్లడించింది. వ్యాపార కార్యకలాపాల్లో ఏఐ వినియోగాన్ని విస్తరించడంతో పాటు ఉద్యోగుల నైపుణ్యాలను మెరుగుపరచడంపై సంస్థలు పెట్టుబడులు పెంచుతున్నాయని ఈ వివరాలు సూచిస్తున్నాయి. కొత్త వేతన నియమావళి నిబంధనలను 65.4 శాతం కంపెనీలు ఇప్పటికే అమలు చేస్తున్నట్లు సర్వే పేర్కొంది. మరో 20.9 శాతం కంపెనీలు వచ్చే ఆరు నెలల్లో ఈ నిబంధనలను అమలు చేయాలని భావిస్తున్నాయి.

# ఫెయిర్‌ఫాక్స్ చేతికి ఐడీబీఐ బ్యాంక్




న్యూఢిల్లీ, అక్టోబర్ 14: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ ఐడీబీఐని.. ప్రైవేట్‌పరం చేయాలని గత కొన్నేండ్లు (2022 నుంచి)గా మోదీ సర్కార్ చేసిన ప్రయత్నాలు ఎట్టకేలకు ఫలించాయి. బ్యాంక్‌లో మెజారిటీ వాటాను వ్యూహాత్మకంగా కొనేందుకు ముందుకొచ్చిన కెనడాకు చెందిన ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్ అనుబంధ సంస్థ (వీ/o 10955230 ఋఋఋ ×అఎ) ప్రతిపాదనకు ఆర్థిక వ్యవహారాలపై ఏర్పాటైన క్యాబినెట్ కమిటీ (సీసీఈఏ) బుధవారం పచ్చ జెండా ఊపింది. దీంతో ఐడీబీఐ బ్యాంక్‌లో రూ.52,878 కోట్ల (దాదాపు 5.6 బిలియన్ డాలర్లు)తో 60.72 శాతం వాటా ఫెయిర్‌ఫాక్స్ హస్తగతమవుతున్నది. కాగా, ఓ భారతీయ బ్యాంక్‌లోకి ఇంత పెద్ద ఎత్తున విదేశీ పెట్టుబడి రావడం ఇదే తొలిసారి. ఇక ఈ డీల్‌లో భాగంగా బ్యాంక్‌లో కేంద్ర ప్రభుత్వానికి చెందిన 30.48 శాతం వాటాను, ప్రభుత్వ రంగ జీవిత బీమా దిగ్గజం ఎల్ఐసీకి చెందిన 30.24 వాటాను బిలియనీర్ ప్రేమ్ వాత్స సారథ్యంలోని గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ హోల్డింగ్ కంపెనీ అయిన ఫెయిర్‌ఫాక్స్ చేజిక్కించుకుంటున్నది. ఇందుకుగాను కేంద్రానికి సుమారు రూ.26,600 కోట్లు, ఎల్ఐసీకి దాదాపు రూ.26,400 కోట్లు సదరు సంస్థ నుంచి రానున్నాయి. ఒక్కో షేర్‌కు రూ.81 చొప్పున చెల్లించనున్నది. ఇక ఈ డీల్ వచ్చే ఏడాది మార్చి ఆఖరుకల్లా పూర్తికావచ్చని తెలుస్తుండగా.. ఆర్బీఐ, సీసీఐ, ఇతర రెగ్యులేటరీ అనుమతులు కావాల్సి ఉన్నది. కాగా, ఐడీబీఐ బ్యాంక్ వ్యూహాత్మక పునర్వ్యవస్థీకరణకు సీసీఈఏ ఆమోదం తెలుపడాన్ని.. దేశీయ బ్యాంకింగ్ రంగానికి లభించిన గొప్ప ఉత్సాహంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అభివర్ణించారు. ఇక బ్యాంక్ రికవరీకి ప్రభుత్వం ఇన్నాళ్లు మద్దతిచ్చిందంటూ 'ఎక్స్'లో చెప్పుకొచ్చిన మంత్రి.. ఇప్పటికీ కేంద్రానికి మైనారిటీ వాటా ఉన్నదని గుర్తుచేశారు. మొత్తానికి దేశంలోకి మరిన్ని విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)కు ఐడీబీఐ డీల్ బాటలు వేసిందని అభిప్రాయపడ్డారు.

**ఈసారి లక్ష కోట్ల పైనే..**

ఎనిమిదేండ్ల తర్వాత ఈ ఆర్థిక సంవత్సరం (2026-27) ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణలకు సంబంధించి బడ్జెట్‌లో పెట్టుకున్న మోదీ సర్కార్ లక్ష్యం నెరవేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఐడీబీఐలో వాటా విక్రయంతో ఖజానాకు దాదాపు రూ.53,000 కోట్లు రానుండటమే కారణం. చివరిసారిగా 2018-19లో కేంద్ర ప్రభుత్వం లక్ష్యాన్ని సాధించింది. మళ్లీ ఇప్పటిదాకా సాధ్యం కాలేదు. కాగా, ఈ ఆర్థిక సంవత్సరం ప్రభుత్వ లక్ష్యం రూ.80,000 కోట్లుగా ఉన్నది. ఇప్పటిదాకా ఎల్ఐసీ, కోల్ ఇండియా సహా 9 ప్రభుత్వ రంగ సంస్థల్లో చిన్నచిన్న వాటాల అమ్మకం, ఇండియన్ మెడిసిన్స్ ఫార్మాస్యూటికల్స్ కార్పొరేషన్ లిమిటెడ్ వ్యూహాత్మక విక్రయం, ఎస్‌యూయూటీఐ నుంచి రెమిటెన్స్‌ల ద్వారా రూ.55,757 కోట్లను సమీకరించారు. ఇప్పుడు ఐడీబీఐ డీల్‌తో ఇది లక్ష కోట్ల రూపాయలను దాటిపోనున్నది.

## మీ సిబిల్ స్కోర్ తక్కువగా ఉందా.. 6 నెల్లలో ఇలా సింపుల్‌గా పెంచుకోండి..

జీవితంలో సిబిల్ స్కోర్ అనేది ప్రతి ఒక్కరి వ్యక్తిగత రుణ అర్హతను నిర్ణయించే అత్యంత కీలకమైన అంశం. మనం నిత్య జీవితంలో తీసుకునే వివిధ రకాల లోన్లు, క్రెడిట్ కార్డుల బిల్లులను సక్రమంగా చెల్లించే విధానం ఆధారంగా క్రెడిట్ బ్యూరోలు ఈ స్కోర్‌ను గరిష్ఠంగా తొమ్మిది వందల పాయింట్ల వరకు లెక్కిస్తాయి. సాధారణంగా ఏడు వందల యాభై పైన ఉన్న స్కోర్‌ను అత్యుత్తమంగా భావిస్తారు. ఒకవేళ ఈ స్కోర్ ఊహించని విధంగా పడిపోతే, బ్యాంకులు, ఆర్థిక సంస్థలు రుణాలు మంజూరు చేయడానికి తీవ్రంగా వెనుకాడతాయి. అంతేకాకుండా.. అత్యవసర పరిస్థితుల్లో క్రెడిట్ కార్డులు పొందడం కూడా కష్టమైపోతుంది. తక్కువ సిబిల్ స్కోర్ కారణంగా భవిష్యత్తులో గృహ రుణాలు, వాహన రుణాలు లేదా వ్యక్తిగత రుణాలు దక్కకపోవడమే కాకుండా, ఒకవేళ లభించినా చాలా ఎక్కువ వడ్డీ రేట్లను భరించాల్సి వస్తుంది. అయితే ఈ సమస్య చూసి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. సరైన ఆర్థిక క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన ప్రణాళికాబద్ధమైన అలవాట్లను క్రమం తప్పకుండా పాటిస్తే పడిపోయిన స్కోర్‌ను కేవలం ఆరు నెలల స్వల్ప వ్యవధిలోనే తిరిగి మెరుగుపరుచుకోవడం పూర్తిగా సాధ్యమవుతుంది. ప్రస్తుత లోన్ల ఈఎంఐలు, క్రెడిట్ కార్డు బిల్లులను ఎట్టి పరిస్థితుల్లోనూ గడువు తేదీలోపు చెల్లించడం ద్వారా రీపేమెంట్ హిస్టరీని పటిష్టం చేసుకోవాలి. క్రెడిట్ యుటిలైజేషన్ నిబంధన ప్రకారం కేటాయించిన మొత్తం పరిమితిలో ముప్పై శాతం కంటే తక్కువ ఖర్చు చేయడానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ఉదాహరణకు లక్ష రూపాయల పరిమితి ఉంటే ముప్పై వేల రూపాయల కంటే మించి వాడకూడదు. తక్కువ సమయంలో పదేపదే వివిధ లోన్ల కోసం దరఖాస్తు చేయడం వల్ల హార్డ్ ఎంక్వైరీలు పెరిగి స్కోర్ మరింత క్షీణిస్తుంది కాబట్టి కొత్త దరఖాస్తులకు దూరంగా ఉండాలి. క్రెడిట్ రిపోర్టులను క్రమం తప్పకుండా పరిశీలించి, క్లోజ్ అయిన లోన్లు ఇంకా యాక్టివ్‌గా చూపించడం వంటి ఏవైనా సాంకేతిక లోపాలు ఉంటే వెంటనే సంబంధిత బ్యాంకులను సంప్రదించి సరిదిద్దుకోవాలి. పాత క్రెడిట్ ఖాతాలను అలాగే కొనసాగించడం, సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులను వినియోగించడం ద్వారా క్రెడిట్ హిస్టరీని మరింత బలోపేతం చేసుకోవచ్చు. ఈ నిబంధనలన్నింటినీ కచ్చితంగా పాటిస్తే ఆరు నెలల్లోనే మీ సిబిల్ స్కోర్ గణనీయంగా పుంజుకుంటుందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

# ఈ సారి అలా చేస్తే సహించను
# కంటెస్టెంట్లకు వార్నింగ్



బుల్లితెర రియాలిటీ షో బిగ్‌బాస్ షోకు అంతా రెడీ అవుతోంది. ఇప్పటికే హిందీ బిగ్‌బాస్ తేదీని కూడా రివీల్ చేశారు. ఇటీవలే ప్రోమో రిలీజ్ చేసి సెప్టెంబర్ 6 నుంచి ప్రారంభం కానుందని ప్రకటించారు. దీంతో టాలీవుడ్ అభిమానులు సైతం తెలుగు సీజన్-10 ఎప్పుడా అని ప్రకటన కోసం ఎదురు చూస్తున్నారు. ఈ సందర్భంగా హోస్ట్ నాగార్జున పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. బిగ్‌బాస్ సీజన్-10 ప్రోమో షూటింగ్ ఇటీవలే పూర్తయిందని నాగ్ వెల్లడించారు. ఈ సారి పదో సీజన్‌కు హోస్ట్‌గా వ్యవహరించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ సీజన్ మరింత ఉన్నతంగా ప్లాన్ చేస్తున్నారని.. గతం కంటే ఆసక్తికరంగా ఉంటుందని తెలిపారు. ఇతరుల ప్రవర్తనను నిర్ణయించడం, సూచనలు చేయడం నాకిష్టం ఉండదన్నారు. అందుకే మొదటి రెండు సీజన్లలో కాస్తా ఇబ్బంది పడ్డానని.. ఆ తర్వాత షో ఫార్మాట్ అలవాటైందని వెల్లడించారు. గత సీజన్ సూపర్ హిట్ కావడంతో ఈసారి ఫిజికల్ టాస్కులు మరింత కఠినంగా ఉండబోతున్నాయని హింట్ ఇచ్చారు. అంతే కాకుండా ఈ రియాలిటీ షోలో కంటెస్టెంట్లు హద్దులు దాటి ప్రవర్తిస్తే అస్సలు సహించనని నాగ్ స్పష్టం చేశారు.



# 'కాష్మోరా' మ్యాజిక్ రిపీట్.. కార్తీ నయనతార కాంబోలో భారీ చిత్రం!



కొన్ని కాంబినేషన్లు మొదటి నుంచి ఆసక్తిని క్రియేట్ చేస్తాయి. చిత్రాలకు హైప్ తీసుకొస్తాయి. అలా తాజాగా నటుడు కార్తీ హీరోగా నటించడానికి సిద్ధం అవుతున్న చిత్రం ఫేమ్ థింగ్ స్పెషల్‌గా మారుతోంది. ఈయన ప్రస్తుతం నటిస్తున్న చిత్రాల్లో సర్దార్--2 ఒకటి . కార్తీ తండ్రి కొడుకులుగా ద్విపాత్రాభినయం చేసిన ఈ చిత్రం త్వరలో తెరపైకి రావడానికి ముస్తాబు అవుతోంది. దీంతో పాటూ మార్షల్ చిత్రం షూటింగ్ దశలో ఉంది. అంతేకాకుండా మరో మూడు చిత్రాలు కమిట్ అయ్యారు. అందులో తెలుగు చిత్రం హిట్ --3 కూడా ఉంది. కాగా తాజాగా మోహన్ రాజా దర్శకత్వం ఒక చిత్రం చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రిన్స్ పిక్చర్స్ పతాకంపై ఎస్.లక్ష్మణన్ నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రం గురించే కోలీవుడ్లో పెద్ద చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ఈ చిత్రంలో నటించే కథానాయకి ఎవరన్న విషయంలో తాజాగా నటి నయనతార పేరు వెలుగులోకి వచ్చింది. 40 వసంతాలు దాటినా అగ్ర కథానాయికిగా రాణిస్తున్న ఈ పాన్ ఇండియా భామను అటు ఉత్తరాది, ఇటు దక్షిణాదిలోనూ భారీ అవకాశాలు వెతుక్కుంటూ వస్తున్నాయి. హిందీలో ప్రస్తుతం సల్మాన్ ఖాన్‌కు జంటగా ఒక చిత్రం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రం కోసం ఆమె ఒక తెలుగు చిత్రాన్ని వదులు కున్నట్లు ప్రచారం జరిగింది. కాగా తమిళంలో నటిస్తున్న మూకుత్తి అమ్మన్-- 2 చిత్రం త్వరలో తెరపైకి రావడానికి సిద్ధమవుతోంది. ఇవి కాక రాకాయి, మన్నాంగట్టి, మలయాళ చిత్రం డియర్ స్టూడెంట్ చిత్రాలు నిర్మాణంలో ఉన్నాయి. అదే విధంగా కవిన్‌కు జంటగా నటిస్తున్న హాయ్ చిత్రం షూటింగ్ ను పూర్తి చేసుకుని నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకుంటోంది. ఇక యష్‌తో కలిసి నటించిన టాక్సిక్ చిత్రం త్వరలో విడుదలకు సిద్ధం అవుతోంది. విశేషం ఏమిటంటే ఇందులో ఈమె ప్రతినాయకిగా నటించినట్లు సమాచారం. ఇకపోతే కార్తీతో కలిసి ఇంతకు ముందు కాష్మోరా చిత్రంలో నటించిన నయనతార ఇప్పుడు మరోసారి ఆయనతో జత కట్టడానికి సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. దీంతో ఇంకా షూటింగ్ ప్రారంభం కాక ముందే ఈ చిత్రంపై ఆసక్తి నెలకుంటోంది.



# డిసెంబరులో రిలీజ్?

'తండేల్' వంటి బ్లాక్‌బస్టర్ సినిమా తర్వాత నాగచైతన్య హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'వృషకర్మ'. ఈ సినిమాలో మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తుండగా, 'లాపతా లేడీస్' మూవీ ఫేమ్ స్పర్శ్ శ్రీవాస్తవ విలన్‌గా నటిస్తున్నారు. 'విరూపాక్ష' చిత్రంతో సూపర్ హిట్ అందుకున్న కార్తీక్ వర్మ దండు దర్శకత్వం వహిస్తున్నారు. బాపినీడు సమర్పణలో శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర, సుకుమార్ రైటింగ్స్‌పై బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ .బి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమా డిసెంబరులో ప్రేక్షకుల ముందుకు రానుందనే టాక్ వినిపిస్తోంది. పౌరాణిక నేపథ్యం, థ్రిల్లింగ్ కథనంతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో తన పాత్ర కోసం నాగచైతన్య ఫిజికల్‌గా కొత్తగా ట్రాన్స్‌ఫార్మ్ అయ్యారు. ఈ విషయాన్ని మార్చి 5న విడుదలైన గ్లింప్స్ స్పష్టం చేసింది. తన కెరీర్‌లో పూర్తిగా భిన్నమైన కథను ఎంచుకుని 'వృష కర్మ'తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు చైతన్య. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ వేగంగా కొనసాగుతోంది. అయితే ఈ సినిమా విడుదల తేదీపై చిత్రయూనిట్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రానప్పటికీ డిసెంబరులో ప్రేక్షకుల ముందుకు రానుందనే వార్త ప్రచారంలోకి వచ్చింది. కాగా ఈ చిత్రానికి అజనీష్ బి. లోక్‌నాథ్ సంగీతం అందిస్తుండగా, రాగుల్ డి. హెరియన్ కెమెరామేన్‌గా వ్యవహరిస్తున్నారు.

# భావోద్వేగాల స్పిరిట్

ప్రభాస్ హీరోగా నటిస్తున్న తాజా పాన్ ఇండియన్ మూవీ 'స్పిరిట్'. 'అర్జున్ రెడ్డి, కబీర్ సింగ్, యానిమల్' చిత్రాల ఫేమ్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో 'యానిమల్' మూవీ ఫేమ్ తృప్తి డిమ్రీ హీరోయిన్‌గా నటిస్తుండగా, ప్రకాష్‌రాజ్, వివేక్ ఒబెరాయ్, కాంచన కీలక పాత్రలు పోషిస్తున్నారు. భద్రకాళి పిక్చర్స్ ప్రొడక్షన్స్, టీ--సిరీస్ బ్యానర్స్‌పై ప్రణయ్ రెడ్డి వంగా, భూషణ్ కుమార్, కృష్ణన్ కుమార్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో ప్రభాస్ తొలిసారి పోలీసాఫీసర్ పాత్రలో నటిస్తున్న సంగతి తెలిసిందే. పోలీస్ అనగానే పవర్‌ఫుల్ యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ చిత్రం సాగుతుందని అనుకుంటారు. అయితే ఈ సినిమాలో భావోద్వేగాలకు కూడా ఎంతో ప్రాధాన్యం ఉందట. ఈ విషయాన్ని చిత్ర నిర్మాతల్లో ఒకరైన భూషణ్ కుమార్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. "స్పిరిట్' లో తన కెరీర్‌లోనే మోస్ట్ ఇంటెన్స్ క్యారెక్టర్‌లో కనిపించబోతున్నారు ప్రభాస్. తన మార్క్ యాక్షన్, ఎమోషన్స్‌తో అద్భుతమైన అనుభూతిని ఇచ్చేలా తీర్చిదిద్దుతున్నారు సందీప్. ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాలను చూశాను. పోలీస్ స్టోరీ కథ అయినప్పటికీ కుటుంబ నేపథ్యం, బలమైన భావోద్వేగాలు ఉంటాయి. మునుపెన్నడూ చూడని సినిమా ఇది అని ప్రేక్షకులు భావిస్తారు" అని పేర్కొన్నారు. ఈ సినిమా తెలుగు, హిందీ, తమిళ్, మలయాళ, కన్నడతో పాటు చైనీస్, జపనీస్, కొరియన్ సహా మొత్తం 8 భాషల్లో 2027 మార్చి 5న విడుదల కానుంది.





# అది తెలియకపోవడం అవమానమే విద్యార్థులకు ధనుశ్ చురకలు

కోలీవుడ్ హీరో ధనుశ్ ఆసక్తికర కామెంట్స్ చేశారు. చెన్నైలో తన సొంత నిధులతో నిర్మించిన స్కూల్ భవనాన్ని ప్రారంభించారు. ఆ పాఠశాల పూర్వ విద్యార్థి అయిన ధనుశ్.. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మీరంతా మాతృభాష పట్ల శ్రద్ధ చూపాలని అన్నారు. తమిళం రాకపోవడం కరెక్ట్ కాదని.. అది నిజంగా సిగ్గుచేటని విద్యార్థులకు చురకలంటించారు. ఈ సందర్భంగా ధనుష్ తన పాఠశాల రోజులను గుర్తుచేసుకున్నారు. ఇతర భాషలలో ప్రావీణ్యం సంపాదించే ముందు విద్యార్థులు మొదట తమ మాతృభాషను చదవడం, రాయడం నేర్చుకోవాలని ధనుశ్ విజ్ఞప్తి చేశారు. ధనుశ్ మాతృభాష గురించి మాట్లాడుతూ.. "ఒకరు మొదట తమ మాతృభాషను నేర్చుకోవాలి. వారు మొదట దానిని చదవడం, రాయడం నేర్చుకోవాలి. మీకు తమిళం రాదని చెప్పడం గర్వించదగిన విషయం కాదు. మీ మాతృభాష తెలియకపోవడం నిజానికి అవమానకరం. దయచేసి మీ మాతృభాషకు ప్రాధాన్యత ఇవ్వండి. దయచేసి తమిళంపై కూడా దృష్టి పెట్టండి" అని విద్యార్థులకు సూచించారు. ధనుశ్ మాట్లాడుతూ..'చిన్నప్పుడు తాను ఇంగ్లీషుతో ఇబ్బంది పడినప్పటికీ.. తమిళంలో మాత్రం ఎప్పుడూ అనర్గళంగా మాట్లాడేవాడినని గుర్తుచేసుకున్నారు. నేను ఇక్కడ చదువుతున్నప్పుడు నాకు ఇంగ్లీష్ సరిగ్గా వచ్చేది కాదు.. బాగా మాట్లాడలేకపోయేవాడిని.

Printed, Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com